SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 196 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 26 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

తెలంగాణ మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహిళలు ఆదానీ, అంబానీలను మించిన పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా వారోత్సవాల సందర్భంగా సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 8 వేల స్వయం సహాయక సంఘ భవనాలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.'

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## కోటి మంది మహిళలను

# కోటీశ్వరులను చేస్తాం

## ఆదానీ, అంబానీని మించేలా మహిళలను తీర్చిదిద్దుతాం



### ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

2

### మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి రుణపరిమితి రూ.10 లక్షలకు పెంచుతున్నాం

- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్‌గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే రాష్ట్రంలో ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, రాబోయే 2034 నాటికి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహిళలు కేవలం చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా ఆర్థికంగా బలోపేతమై కార్పొరేట్ దిగ్గజాలైన ఆదానీ, అంబానీలను మించిన పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.రాష్ట్రంలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సోమవారం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశ చరిత్రలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు

మిగతా 2 లో

# పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

## పలువురు ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ

- రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల కార్యక్రమం
- కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు
- తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులకు పద్మ గౌరవం
- మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ



పద్మ అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. విశిష్ట సేవలందించిన ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు.


4

## హైదరాబాద్ మెట్రోకు ఆర్థిక ఊరట

### రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి ఒప్పందం



హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి.



## నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

గుణపాఠం నేర్చుకోని ఎన్‌టిఎ సుప్రీం ధర్మాసనం అసహనం

.. వివరాలు 4లో

కాక్రోచ్ జనతాపార్టీపై

## అత్యవసర విచారణ

తిరస్కరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం

.. వివరాలు 4లో

# స్టార్టప్‌లకు ప్రోత్సాహం

### వంద యూనికార్న్ సంస్థల ఏర్పాటు లక్ష్యం విలేజ్ టూ గ్లోబల్ మా ప్రభుత్వ నినాదం

దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలలే ఊతం

విజయవాడ ఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమ్మిట్‌లో చంద్రబాబు

5







## బతికుంటే సాయం సున్నా..

# చస్తే కనీస గౌరవం కరువు!

2

### మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై కేటీఆర్ ఆగ్రహం "ప్రచారాలకు కోట్ల ఖర్చు.. పేదల అంతిమయాత్రకు వాహనం లేదా?" అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మండిపాటు

తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో మానవత్వం పూర్తిగా మాయమైందని కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పేద ప్రజలు బతికున్నప్పుడు సహాయం దొరకకపోవడమే కాకుండా, మరణించిన తర్వాత కూడా కనీస గౌరవం దక్కని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.



నాల్గోసారి పెరిగిన

## పెట్రో ధరల పెంపు

పెట్రోల్‌పై రూ.2.61

డీజిల్‌పై రూ.2.71

.. వివరాలు 4లో

## లాయర్ హత్య కేసులో స్కార్పియో స్వాధీనం





లోతుగా విచారిస్తున్న పోలీస్ బృందాలు

2

## రోహిణి ఎఫెక్ట్!

ఒకవైపు ఈదురుగాలుల వర్షం.. మరోవైపు 46.5 డిగ్రీల భానుడి భగ్గుమంట

.. వివరాలు 2లో





# ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం


## ఈ యేడు మొక్కజొన్న అధికంగా దిగుబడి

## సీపీఐ బృందంతో సీఎం రేవంత్ వెల్లడి

**హైదరాబాద్, మే 25:** కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యింది. సీఎంని కలిసిన వారిలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ, ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాల పై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ధాన్యం సేకరణ, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# లాయర్ హత్య కేసులో స్కార్పియో స్వాధీనం

## లోతుగా విచారిస్తున్న పోలీస్ బృందాలు





**హైదరాబాద్, మే 25:** హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ మరణించిన ఘటనలో నిందితులను పట్టుకోవాలని ఆయన కుమారుడు నగర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. తనకున్న అనుమానలతో ఆధారాలను వివరించారు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన శనివారం తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. బెంగళూరు హైవేపై హత్యకు ఉపయోగించిన 'స్కార్పియో' వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. భూ తగాదాలే ఈ ఘటనకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం, ఇంటి నుంచి బయటకు వచ్చిన ఖాజా మొయినుద్దీన్‌ను నిందితులు వాహనంతో ఢీకొట్టి హత్య చేసినట్లు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్కార్పియో వాహనాన్ని ఇటీవల స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఆ కారును గతంలో విక్రయించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, తాను ఆ వాహనాన్ని ఆరు నెలల క్రితమే అమ్మేశానని వాహన యజమాని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ వాహనం ఎవరి వద్ద ఉందన్న దానిపై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి కల్వకుర్తికి చెందిన వినయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసుకు సంబంధించిన మరికొంతమంది అనుమానితుల కోసం కూడా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# భూదాన్ భూములు బదిలీ వ్యవహారం

## ఈడీ విచారణకు అమేయకుమార్ హాజరు





**హైదరాబాద్, మే 25:** భూదాన్ భూముల వ్యవహారంలో ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్.. సోమవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. భూదాన్ భూముల వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణంలో ఐఏఎస్ అధికారిని ఈడీ విచారిస్తోంది. అమోయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో జరిగిన అక్రమ భూమి బదిలీలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. 2024లో అమోయ్ కుమార్‌ను పలుమార్లు ఈడీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం విచారణకు రావాల్సిందిగా ఐఏఎస్ అధికారికి ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. మూడు సేల్ డీడ్లు, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలు అందజేయాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో ఈరోజు సేల్ డీడ్ వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లతో అమోయ్ కుమార్.. ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. నాగారం గ్రామ పరిధిలోని భూదాన్ భూములను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 42 ఎకరాల భూమిని అక్రమంగా కట్టబెట్టి భారీ మొత్తంలో లాభాలు పొందినట్లు అమోయ్ కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

మొదటి పేజీ తరువాయి

కీలక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మహిళలతో నేరుగా ముచ్చటించి, వారిని ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు.

### కార్పొరేట్ రంగంలోకి మహిళా శక్తి!

సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని సీఎం వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న





ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

### రైస్ మిల్లులు, గోడౌన్లకు 100 ఎకరాల భూమి

మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి మహిళా సంఘాలకు 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు.

### డీమార్ట్ కంటే మిన్నగా 'మహిళా శక్తి బజార్లు'

కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు.

### ఇందిరమ్మ చీరలతో పాలపిట్టల్లా ఆడబిడ్డలు

గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామంటూ వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక ఊరట

## 13,600 కోట్ల రుణ సదుపాయానికి ఒప్పందం

**హైదరాబాద్, మే 25:** హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్‌ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణ రావు తెలిపారు.



హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను రీ÷నాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీ÷నాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నారు. రీ÷నాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలగనుంది. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుంది. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

# రోహిణి ఎఫెక్ట్..!

## ఒకవైపు ఈదురుగాలుల వర్షం

## మరోవైపు 46.5 డిగ్రీల భానుడి భగ్గుమంట

**హైదరాబాద్, మే 25:** తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవగా.. మరోవైపు రోహిణి కార్తె ప్రభావంతో మండుటెండలు మరింత తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం పడగా, మెదక్, సూర్యాపేట జిల్లాల్లో కూడా వర్షాలు కురిశాయి. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కాస్త ఊరటనిచ్చాయి. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. గంగినేని థియేటర్ వద్ద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని ర్యాలమడుగులో ఈదురుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోగా, మంభోజిపల్లిలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడులో బలమైన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక రోహిణి కార్తె ప్రారంభమవడంతో తెలంగాణ వ్యాప్తంగా ఎండలు భగ్గుమంటున్నాయి. తెలంగాణ ప్రణాళికా సంఘం విడుదల చేసిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు, నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీలు నమోదయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండలో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు నమోదయ్యాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటడంతో రెడ్ అలర్ట్ పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్ నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రంగారెడ్డి జిల్లాలో 43.1 డిగ్రీలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45.7 డిగ్రీల వరకు చేరే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు మధ్యాహ్నం వేళల్లో అవసరం లేకుండా బయటకు వెళ్లొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.



# కేటీఆర్‌కు ఆ అర్హత లేదు!

## ఫోన్ ట్యాపింగ్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం

## ఇందిరమ్మ ఇండ్లపై బీఆర్ఎస్ నేతకు సవాల్

## జూన్ 1న మరో 2.5 లక్షల ఇండ్లకు శ్రీకారం

**హైదరాబాద్, మే 25 :** సొంత చెల్లి, బావ ఫోన్‌లను కూడా ట్యాప్ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కేటీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. నిరంతరం ఫామ్‌హౌస్‌లలో ఉండే వారికి క్షేత్రస్థాయి వాస్తవాలు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందన్నారు. జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ డ్రామాలు ఆడుతున్న కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి, లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ లాంటి సిట్టింగ్ స్థానాల్లోనూ బీఆర్ఎస్‌ను ఓడించిన ప్రజలు.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి పూర్తిగా వీఆర్ఎస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. అందువల్ల కేటీఆర్ ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, అదే సమయంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదని, ఈ సవాల్‌కు సిద్ధమేనా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు.



# పెట్రో ధరల భారాన్ని తగ్గించండి

## వెంటనే వ్యాట్ తగ్గించడమే పరిష్కారం

## సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ

**హైదరాబాద్,మే25:** కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో చోద్యం చూడటం మానేసి, వెంటనే రాష్ట్ర వ్యాట్ తగ్గించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాశారు. 'పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి, రాష్ట్ర పన్నులు తగ్గించాలి'అని నాడు పీసీసీ హోదాలో ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఎందుకు వ్యాట్ తగ్గించడం లేదని లేదని నిలదీశారు. ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాటలు దంచుడు కాదు.. దమ్ముంటే మాట మీద నిలబడి పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు దించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారంలో నాలుగు సార్లు ఫ్యూయల్ ధరలు పెంచి కేంద్రం ప్రజలపై పెను భారం మోపితే, మరోవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ప్రజల నడ్డి విరిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన సాగు ఖర్చులు భరించలేక రైతులు సతమతమవుతుంటే, మరో వైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు రైతుల పరిస్థితి తయారైందన్నారు. రవాణా రంగం తీవ్ర సంక్షోభానికి లోను కావడంతో ద్రవ్యోల్బణం పెరిగి అన్ని వర్గాల ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతున్నదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, పన్నుల భారం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పొలం దున్నాలన్నా డీజిల్ భారం..సామాన్యుడు బైక్ తీయాలన్నా పెట్రోల్ భారం?ఆటో సోదరుడి బతుకు బండి నడవాలన్నా ఇంధన భారం.. పెరిగిన ధరలు ప్రజానీకానికి పెను శాపంగా మారిందన్నారు హరీశ్ రావు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు భరించలేక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ రేవంతు ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఖజానా నింపుకుంటూ సంబుర పడుతుందని, పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. పెరిగిన ధరలతో ప్రతి నెలా రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు 2,000 కోట్ల అదనపు వ్యాట్ ఆదాయం వస్తుంటే.. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విడిచి పెట్టి ప్రచారాలకే పెద్ద పీట వేస్తున్నది విమర్శించారు. ఎన్నికల ముందు వ్యాట్ పై విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, రెండున్నరేళ్లుగా కేనీసం 0.1శాతం వ్యాట్ కూడా తగ్గించకపోవడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక తీరు, అధికారంలోకి వచ్చాక మరొక తీరు వ్యవహరిస్తూ కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. నిజంగా ప్రజా పాలనే అయితే, వెంటనే పెట్రోల్, డీజిల్‌పై కనీసం 10? వ్యాట్ తగ్గించి, పెరిగిన ఇంధన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ పెంపుపై మొసలి కన్నీరు కార్చే రాహుల్ గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ వ్యాట్ దోపిడీపై స్పందించాలని, వ్యాట్ తగ్గించేలా రేవంత్ రెడ్డిని ఆదేశించాలని కోరారు.

## చిరంజీవితో ప్రముఖుల భేటీ!

**హైదరాబాద్, మే 25:** పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన అనేది కేవలం పెద్ద సినిమాలకు మాత్రమే సంబంధించింది కాదని, ఇది చిత్ర పరిశ్రమ మొత్తానికి చెందిందని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్, నిర్మాత దిల్ రాజు స్పష్టం చేశారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పారదర్శకమైన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. సోమవారం టాలీవుడ్ అగ్ర కథానాయకుడు చిరంజీవిని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఎగ్జిబిటర్లు, నిర్మాతలు దిల్ రాజు, సురేష్ బాబు, కేఎల్ నారాయణ, అల్లు అరవింద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సినిమాలు ప్రదర్శించే విషయంలో ఎగ్జిబిటర్లు, థియేటర్ యజమానులు కోరుతున్న పర్సంటేజీ విధానంతో పాటు ఎదురవుతున్న పలు సమస్యలను చిరంజీవి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పర్సంటేజీ విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలని ఇటు నిర్మాతలు, అటు ఎగ్జిబిటర్లకు చిరంజీవి సూచించారు. రాబోయే కొత్త చిత్రాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశం అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ, పర్సంటేజీ విధానంపై ఎగ్జిబిటర్లు చెప్పిన అన్ని విషయాలను చిరంజీవి సానుకూలంగా విన్నారని తెలిపారు. వారం కిందట ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలు తెప్పించుకుని పరిశీలిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని వెల్లడించారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, ఆ వివరాలను ఫిల్మ్ ఛాంబర్ అధికారికంగా ప్రకటిస్తుందని చెప్పారు. నగరంలో ఎదురవుతున్న సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలను కూడా చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లగా, ఇన్ని ఇబ్బందులు ఉన్నాయా అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు దిల్ రాజు తెలిపారు. దీనిపై చర్చించేందుకు ఛాంబర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీని కూడా పిలిపించి మాట్లాడుతానని చిరంజీవి చెప్పినట్లు పేర్కొన్నారు. తాము కూడా ఎగ్జిబిటర్లతో కలిసి కూర్చొని మాట్లాడి త్వరలోనే ఒక తుది నిర్ణయానికి వస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# బతికుంటే సాయం సున్నా.. చస్తే కనీస గౌరవం కరువు!

- మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- "ప్రచారాలకు కోట్ల ఖర్చు.. పేదల అంతిమయాత్రకు వాహనం లేదా?" అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మండిపాటు

**హైదరాబాద్, మే 25:** తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో మానవత్వం పూర్తిగా మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. పేద ప్రజలు బతికున్నప్పుడు సహాయం దొరకకపోవడమే కాకుండా, మరణించిన తర్వాత కూడా కనీస గౌరవం దక్కని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సి వచ్చిన ఘటన తెలంగాణ సమాజాన్నే కలచివేసిందన్నారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా స్పందించిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రాథమిక అవసరాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. "బతికున్నప్పుడు సాయం లేదు.. చనిపోయాక కనీస మర్యాద కూడా లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలనే ఉద్దేశంతో మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచామని గుర్తు చేశారు. అదే ప్రజల పట్ల నిజమైన బాధ్యతాయుత పాలన అని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజల సమస్యలను



పక్కనబెట్టి ప్రచార హోరులో మునిగిపోయిందని విమర్శించారు. పోస్టర్లు, సభలు, హెలికాప్టర్లు, పర్యటనల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ.. పేదలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడంలోనే ప్రభుత్వం బిజీగా ఉందని, సామాన్య ప్రజల బాధలు కనిపించడం లేదని ప్రశ్నించారు.

### రెండు గంటలు వేచిచూసినా స్పందన లేదు..!

భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) ఆదివారం వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఆస్పత్రి సిబ్బందిని మార్చురీ వాహనం కోసం పలుమార్లు వేడుకున్నారు. అయితే దాదాపు రెండు గంటల పాటు ఎదురు చూసినా ఎలాంటి స్పందన రాలేదని బంధువులు వాపోయారు. ప్రైవేటు వాహనం ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేక చివరకు బంధువులే వెంకన్న మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ ఇంటికి తీసుకెళ్లారు. ఈ హృదయవిదారక దృశ్యాన్ని చూసిన స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలు కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### "ఇదేనా కాంగ్రెస్ చెప్పిన మార్పు?"

ఈ ఘటనపై స్పందించిన కేటీఆర్.. "తెలంగాణ గౌరవాన్ని వీధుల్లోకి లాగడానికే ప్రజలు ఈ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. ప్రస్తుతం మాత్రం పేదల ఆత్మగౌరవం దెబ్బతింటోందని, ప్రజా సమస్యల కంటే ప్రచార రాజకీయాలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ధ్వజమెత్తారు. ఈ ఘటన ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని.. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతీకగా నిలిచిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ధాన్యమంతా కొనుగోలు చేస్తాం!

- కేంద్రం తీరుపై మంత్రి తుమ్మల ఫైర్
- ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- యాతలకుంట టన్నెల్ పనులపై సమీక్ష

**ఖమ్మం, మే 25:** దేశంలో అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ఒక్కటేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వరి ధాన్యం కొనుగోళ్ల ఆలస్యానికి కేంద్ర ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని ఆయన ధ్వజమెత్తారు. తప్పులు కేంద్రానివైతే, బాధ్యత లేకుండా బీజేపీ నేతలు బస్సు యాత్రలు చేయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావంతో దేశంలో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్లే రైతాంగం ఇబ్బందులు పడుతోందని మండిపడ్డారు. డిజిటల్ ప్రక్రియలో లోపాల వల్ల ఎక్కడికక్కడ ధాన్యం రవాణా నిలిచిపోయిందని చెప్పారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మిగిలిన ప్రతీ గింజనూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. సోమవారం ఆయన యాతలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను కృష్ణా, గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయడమే తన



లక్ష్యమన్నారు. ఖమ్మం జిల్లాలో గోదావరి ప్రవాహ ప్రాంతం ఎక్కువ ఉన్నప్పటికీ, అత్యధిక భూభాగం నాగార్జున సాగర్ కెనాల్ కంటే ఎగువన ఉండటం వల్ల గతంలో జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసినప్పుడే ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించాలని నాటి ముఖ్యమంత్రిని కోరినట్లు తుమ్మల గుర్తుచేశారు. నల్గొండ ఫ్లోరైడ్ బాధితుల కోసం నాటి సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అవకాశం ఇచ్చారని, గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రాజెక్టును తామే ప్రారంభించామని చెప్పారు. గోదావరి ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని గుర్తించి, 1998లోనే దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామన్నారు. నాటి రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పనులు గత ప్రభుత్వ హయాంలో కేవలం పంప్ హౌస్ నిర్మాణాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో యాతలకుంట టన్నెల్ పూర్తి చేయడానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మొదట రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతులు ఇచ్చారని, కేవలం ఆరు నెలల్లోనే ఆ పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి అనుమతితోనే 15 నెలల స్వల్ప వ్యవధిలో రెండు కిలోమీటర్ల పొడవైన యాతలకుంట టన్నెల్ నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. ఈ టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీరు అందించబోతున్నామన్నారు. టన్నెల్ పనులు పూర్తి చేసిన ఏజెన్సీని, అధికారులను ఆయన అభినందించారు. ఆగస్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ అక్విడెక్ట్ నిర్మించామని గుర్తుచేశారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన రైతులకు సరైన నష్టపరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా వెల్లడించారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం!

- కృష్ణా జలాలపై ఇరు రాష్ట్రాల మంత్రుల భేటీ
- రైతాంగ అవసరాలకే తొలి ప్రాధాన్యత
- సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, మే 25:** నీటి వినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాల పరిరక్షణకు అనుకూలంగా ఉండేలా ఒప్పందాలు కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగం, తాగు, సాగునీటి అవసరాలపై కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజుతో కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి పాల్గొన్నారు. రాయచూరు లోకసభ సభ్యుడు జి. కుమార్ నాయక్, నాగర్‌కర్నూల్ లోకసభ సభ్యుడు మల్లు రవితో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, శివకుమార్ రెడ్డి, వంశీకృష్ణ హాజరయ్యారు. అధికారుల తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఐ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఈఎన్సీ రమేష్ బాబు, కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ కార్యదర్శి బి.కె. పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కృష్ణా జలాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో అనుసరించబోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లనుండా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక మంత్రి బోసురాజుకు సమగ్రంగా వివరించినట్లు తెలిపారు. కృష్ణా నదిపై ప్రతిపాదిత బారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించామని వెల్లడించారు. తెలంగాణ సాగునీటి, తాగునీటి హక్కుల పరిరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు మంత్రి పేర్కొన్నారు. అంతరాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను కర్ణాటక ప్రభుత్వం ముందుంచినట్లు చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఈ చర్చల్లో తెలంగాణ రైతాంగ సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కులకు భంగం కలగకుండా, ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండేలా కృష్ణా జలాల వినియోగంపై కూలంకషంగా మాట్లాడామన్నారు. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఈ చర్చల వివరాలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి, త్వరలోనే సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్‌తో 'ఆటా' ప్రతినిధుల భేటీ!

**హైదరాబాద్, మే 25:** అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఈ ఏడాది జూలై 31 నుండి ఆగస్టు 2 వరకు నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) తెలుగు మహాసభలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆటా ప్రతినిధులు ఆహ్వానించారు. సోమవారం సచివాలయంలో వారు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంను కలిసిన వారిలో ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల, కాన్ఫరెన్స్ రీజినల్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ బండా, ప్రవీణ్ పాల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా మహాసభల ఏర్పాట్లను వారు ముఖ్యమంత్రికి వివరించారు.





# జెన్-జీ రాజకీయం

## మీమ్స్ దాటని నిరసన.. మారబోని వ్యవస్థ!

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రస్తుతం ఒక విచిత్రమైన సంధియుగంలో ఉంది. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం మనది. సుమారు 145 కోట్ల జనాభా కలిగిన ఈ దేశంలో 65 శాతానికి పైగా జనాభా 35 ఏళ్ల లోపు ఉన్నవారే. అంటే దేశ భవిష్యత్తును, పాలకుల తలరాతలను శాసించగల అపారమైన శక్తి నేటి 'జెన్-జీ' (నేటి తరం యువత) చేతుల్లో ఉంది. చట్టసభల్లో పాతకాలపు పాచిపోయిన విధానాలను తూర్పారబడుతూ, అవినీతి అక్రమాలను నిలదీస్తూ యువతరం రాజకీయాల్లోకి దూసుకురావాల్సిన సమయమిది. కానీ, దురదృష్టవశాత్తూ నేటి యువతరం క్షేత్రస్థాయి వీధి పోరాటాలను వదిలేసి, సామాజిక మాధ్యమాల వేదికగా 'మీమ్స్', వ్యంగ్యాస్త్రాలకే పరిమితమవుతోంది. ఓటు వేయడానికి బద్ధకిస్తూ, ఆన్‌లైన్ వేదికలపై ఫేక్ ఎజెండాలకు కోట్లల్లో లైకులు కొడుతూ కాలం వెళ్లదీస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (బొద్దింకల పార్టీ) వ్యవహారమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

### కోర్టు వ్యాఖ్యల వక్రీకరణ.. 'కాక్రోచ్' ఎజెండా!

అమెరికా నుంచి ఒక వ్యక్తి సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ'కి ఆన్‌లైన్‌లో కోట్ల సంఖ్యలో లైకులు, 1.6 కోట్ల ఫాలోవర్లు రావడం రాత్రికి రాత్రే పెద్ద చర్చగా మారింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చారంటూ ఈ 'జెన్-జీ' సేన గొంతెత్తింది. అయితే, ఇక్కడ అసలు నిజాన్ని విస్మరించి గొర్రెల్లా మద్దతు తెలపడం దారుణం. ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా చెలామణి అవుతూ, సమాజంపై పడుతున్న కొందరు ఆర్‌టీఐ దళారులను ఉద్దేశించి న్యాయమూర్తి ఆ వ్యాఖ్యలు చేశారు. ఆ సందర్భాన్ని తెలుసుకోకుండా, కోర్టు ధిక్కరణకు పాల్పడేలా వ్యవస్థలపై బురదజల్లడం ఫ్యాషన్‌గా మారింది. ఈ పార్టీ వెనుక ఉన్న సూత్రధారుల గత చరిత్రను పరిశీలిస్తే.. ఇది పక్కాగా కాంగ్రెస్, ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) గేమ్ ప్లాన్‌లో భాగమనే విషయం స్పష్టమవుతోంది. నిరుద్యోగం, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ లాంటి అసలు సమస్యలను వదిలేసి, రిటైర్డ్ జడ్జిలను ఎంపీలుగా తీసుకోవద్దు, ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం అంటూ ప్రతిపక్షాల పొలిటికల్ ఎజెండాను మోయడం యువత అచేతనత్వానికి నిదర్శనం.

### గబ్బిలాల్లాంటి వారసత్వం.. ప్రశ్నించని తరం!

నిజానికి యువతరం గట్టిగా నిలదీయాల్సింది దేశాన్ని దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న వారసత్వ రాజకీయాలను, కుటుంబ పాలనను. చట్టసభల్లో కొన్ని కుటుంబాలే గబ్బిలాల్లా తరతరాలుగా పట్టుకుని వేలాడుతున్నాయి. దేశంలో ఏ పార్టీని చూసినా ఇదే తంతు. పార్లమెంటులో ఒకే కుటుంబం నుంచి సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలు ఉండాలి. అటు అధికార బీజేపీలో అమిత్ షా కుమారుడు ఏ అర్హతతో బీసీసీఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారో నిలదీసే నాథుడే లేడు.

తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు కుటుంబం నుంచి లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలే పదవుల్లో ఉండాలా? తెలంగాణలో ఒకప్పుడు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా ఏలిందో చూశాం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ వెంకటస్వామి కొడుకులు వివేక్, వినోద్, మనవడు వంశీలు ఎస్సీ రిజర్వ్‌డ్ కేటగిరీల్లో ప్రజాప్రతినిధులుగా ఏలుతున్నారు. మల్లు భట్టి విక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు ఒకే ఇంట నుంచి చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ దేశంలో, ఈ రాష్ట్రాల్లో వీరి కుటుంబాలు తప్ప వేరే నాయకులే లేరా? తెలంగాణ మలిదశ ఉద్యమంలో వేలాది మంది యువకులు బలిదానాలు చేసుకుంటే.. నేడు పదవులు, అధికారాలు మాత్రం కొన్ని కుటుంబాలకే పరిమితమవడాన్ని జెన్-జీ యువత ఎందుకు ప్రశ్నించడం లేదు?

### వీధి పోరాటాల నుండి వర్చువల్ ప్రపంచంలోకి..

ఒకప్పుడు భారత రాజకీయాల్లో యువత పాత్ర అనన్యసామాన్యం. స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్, ఆజాద్ వంటి యువకిశోరాలు ప్రాణాలర్పించారు. ఆ తర్వాత అస్సాంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' (ఆసు) చేసిన పోరాటం దేశ చరిత్రలోనే నిలిచిపోయింది. తెలంగాణ సాధనలోనూ ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులే రథసారథులయ్యారు. తీవ్రమైన చర్చలు, క్షేత్రస్థాయి వీధి పోరాటాల ద్వారా నాటి తరం వ్యవస్థలను కదిలించింది. కానీ నేటి డిజిటల్ యుగంలో ఆ తీవ్రత లోపించింది. విద్యావ్యవస్థ భ్రష్టు పడుతున్నా, వైద్యారోగ్య రంగం ప్రైవేటుకు తాకట్టు అవుతున్నా.. యువత కేవలం సోషల్ మీడియా 'ట్రెండ్స్' కే పరిమితమవుతోంది.

### సిద్ధాంతాలు లేని అవకాశవాదం

దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే పార్టీలు మారిపోతుంటారు. విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే ఇలాంటి అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ 'బొద్దింకల పార్టీ' నిలదీయగలిగితే మంచిదే. కానీ, అది మరో రాజకీయ పార్టీ సృష్టించిన తాత్కాలిక వేదిక ద్వారా సాధ్యం కాదు. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకరమైన వేదికలు అవసరం. నేర చరిత్ర లేని నాయకులు చట్టసభల్లో అడుగుపెట్టాలన్నా, భారత ప్రజాస్వామ్యం నిజంగా బలోపేతం కావాలన్నా యువత నిద్ర మేల్కోవాలి. కేవలం సామాజిక మాధ్యమాల్లో 'లైకులు', 'మీమ్స్' వేస్తూ కూర్చుంటే వ్యవస్థ మారదు. దేశ హితాన్ని కోరే నిజమైన ఎజెండాతో యువత నేరుగా రాజకీయాల్లోకి ప్రవేశించి, అక్రమార్కులను ఎండగట్టినప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుంది.

# అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

- రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల కార్యక్రమం
- పలువురు ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలు
- కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు
- తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులకు పద్మ గౌరవం
- మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ



**న్యూఢిల్లీ, మే 25:** దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఏడాది మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలను ప్రకటించగా.. వారిలో ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ అవార్డులు లభించాయి. తొలి విడతగా సోమవారం 60 మందికి రాష్ట్రపతి స్వయంగా అవార్డులు అందజేశారు. తెలంగాణకు చెందిన ప్రముఖ వైద్యులు జి. వెంకట్రావు, డాక్టర్ పి. విజయ్ ఆనంద్ రెడ్డిలకు వైద్య రంగంలో చేసిన సేవలకు గాను పద్మ గౌరవం దక్కింది. అలాగే ప్రముఖ కూచిపూడి నర్తకి దీపికా రెడ్డికి కూడా పద్మ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశ అభివృద్ధికి వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఇక భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ఆమెకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డును ప్రదానం చేశారు. మహిళా క్రికెట్ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రశంసించారు. గతేడాది భారత మహిళల జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన హర్మన్‌ప్రీత్ కౌర్ చారిత్రాత్మక విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. మహిళా క్రికెట్‌లో ఆమె సాధించిన విజయాలకు గుర్తింపుగానే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

# నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

- గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోని ఎన్‌టీఏ
- సుప్రీం ధర్మాసనం అసహనం




**న్యూఢిల్లీ, మే 25:** దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

# కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

## కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు : తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే



**న్యూఢిల్లీ, మే 25:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.

# కాక్రోచ్ జనతాపార్టీపై అత్యవసర విచారణ

## అంతగా భావోద్వేగానికి గురికావద్దు

## తిరస్కరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం



**న్యూఢిల్లీ, మే 25:** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఇటీవల నిరుద్యోగులను కాక్రోచ్‌లతో పోల్చడం, అవి కాస్తా వివాదం కావడం, వివాదాస్పద వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ వైరల్ అయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటీషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే న్యాయవాదులు మాత్రం ఈ పిటిషన్ విచారణకు పట్టుబడుతుండడంతో సోమవారం న్యాయవాదులనుద్దే శించి సుప్రీం చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దానిపై అంత భావోద్వేగానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని కోరారు. కోర్టులో రెండు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కోర్టు పరిశీలనలు వాణిజ్యపరంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తూ ఓ పిల్ దాఖలైంది. కాక్రోచ్ జనతాపార్టీ ప్రచారానికి సంబంధించి సిబిఐ విచారణ కోరుతూ మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ రెండు పిల్‌లపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావించగా ఈ పిటిషన్లను అంత అత్యవసరంగా విచారించాల్సిన ఆవశ్యకత ఏమీ లేదని, వాటిని తగిన సమయంలో పరిశీలిస్తామని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఎన్‌కె గోస్వామి అనే న్యాయవాది వాదించగా.. 'దానికంత భావోద్వేగానికి లోనుకావద్దు' అని సిజెఐ అన్నారు.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

## పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు

**న్యూఢిల్లీ, మే 25:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ. 8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 102.12, డీజిల్ రూ. 95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ. 115.58, డీజిల్ రూ. 103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ. 117.19, డీజిల్ రూ. 104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం



కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.




# బీరు బూస్ట్‌కు గ్రీన్ సిగ్నల్?

**మద్యం విధానంలో భారీ మార్పులకు రంగం సిద్ధం!**

**రాష్ట్రంలో బీరు సరఫరా సామర్థ్య పెంపుపై కీలక చర్చలు**

**ఎక్సైజ్ రంగంలో సంస్కరణలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష**

**విమానాశ్రయాల్లో లిక్కర్ అవుట్‌లెట్ల ఏర్పాటుపైనా పరిశీలన**

**ఆదాయ వృద్ధి, పారదర్శకత లక్ష్యంగా కొత్త చర్యలు**

**విజయవాడ, మే 25 :** రాష్ట్రంలో మద్యం విక్రయ విధానం, బీరు సరఫరా వ్యవస్థ, ఎక్సైజ్ రంగ సంస్కరణలపై ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన విధానాలు, ఆదాయ వృద్ధి చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సోమవారం మంత్రివర్గ ఉపసంఘం విస్తృత సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో బీరు సరఫరా సామర్థ్యాన్ని పెంచడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, ఎక్సైజ్ రంగంలో పారదర్శకత పెంపు వంటి అంశాలపై లోతైన చర్చ జరిగింది. ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ సమావేశంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వర్చువల్‌గా హాజరయ్యారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ఎక్సైజ్ విక్రయ విధానం, మద్యం దుకాణాల పునర్విభజన, లైసెన్స్ రుసుముల సవరణ, వ్యాపారుల ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా విక్రయాలు, మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ ఆదాయంపై కూడా సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావం కారణంగా ముడి సరుకులు, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో బీరు, మద్యం ధరల సవరణ అంశాన్ని కూడా సమావేశంలో పరిశీలించారు. ధరల మార్పులతో ప్రభుత్వ ఆదాయం, వ్యాపారులు, వినియోగదారులపై పడే ప్రభావంపై అధికారులు వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో బీరు సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, అధిక డిమాండ్ ఉన్న కాలాల్లో ప్రత్యేక సరఫరా చర్యలు చేపట్టడం, ఎగుమతులకు అనుమతులు కల్పించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. కొత్త బ్రూవరీలు, పెట్టుబడులను ఆకర్షించే విధానాలపై అధికారులు పలు ప్రతిపాదనలు సమర్పించారు. అదేవిధంగా విమానాశ్రయాల్లో మద్యం విక్రయ కేంద్రాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతం, చలనం ఆధారిత గరిష్ఠ చిల్లర ధర ముద్రణ, అధిక శుద్ధి ఆల్కహాల్ తయారీకి ప్రత్యేక అనుమతి విధానం వంటి అంశాలను కూడా ఉపసంఘం సమీక్షించింది. రాష్ట్రంలో ఎక్సైజ్ రంగాన్ని ఆధునికీకరించడం, పారదర్శకత పెంచడం, ప్రభుత్వ ఆదాయాన్ని మరింతగా వృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ సంస్కరణలు ఉండనున్నాయని అధికారులు వెల్లడించారు.

# స్థానిక సంస్థలకు శుభవార్త

**కేంద్రం రూ.16,627 కోట్ల భారీ నిధులు**

**న్యూఢిల్లీ, మే 25 :** దేశంలోని గ్రామీణ సంస్థల రూపు రేఖలు మార్చేందుకు 16వ ఆర్థిక సంఘం భారీగా నిధులను కేటాయించింది. 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి రూ. 4,35,236 కోట్ల గ్రాంట్ సిఫార్సు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులిచ్చింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ కు రూ.16,627 కోట్లు, తెలంగాణకు రూ.9,968 కోట్లు కేటాయించింది. ఈ నిధులను గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ఇతర పనుల కోసం ఉపయోగించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది.

# స్థల వివాదాంలో జోగయ్య కుమారుడి బెదిరింపులు

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గేయరచయిత అనంతశ్రీరామ్**

**భీమవరం, మే 25:** తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందంటూ పశ్చిమగోదావరి జిల్లా ఉన్నతాధికారులను ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ ఆశ్రయించారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ముఖ్య కేంద్రం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో అనంత శ్రీరామ్ ఈ ఫిర్యాదు చేశారు. పాలకొల్లు సమీపంలోని యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమ ఇంటి ముందున్న ఐదు సెంట్ల ఉమ్మడి స్థలాన్ని ఆక్రమించారంటూ ఆయన తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. ఈ స్థలం కోసం మాజీ ఎంపీ హరి రామజోగయ్య కుమారుడు సూర్యప్రకాశ్ తన తల్లిదండ్రులను బెదిరింపులకు గురి చేస్తూ.. వారిని మానసికంగా హింసకు గురి చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో అనంత శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీకి అనంత శ్రీరామ్ ఫిర్యాదు చేశారు. వారికి రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను అనంత శ్రీరామ్ కోరారు.

# పశువిశ్వవిద్యాలంలో చిరుత

**అమరావతి,మే25 :**తిరుపతి శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంలో చిరుత సంచారంపై ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ప్రస్తుతం చిరుత ఎక్కడ ఉంది? పట్టుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశాలపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో రాజమండ్రి నుంచి పవన్ ఫోన్‌లో సమీక్షించారు. చిరుత ప్రస్తుతం గదిలో నక్కి ఉందని.. సిబ్బంది ఇప్పటికే ఆ ప్రదేశానికి చేరుకున్నట్టు అధికారులు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా అప్రమత్తంగా వ్యవహరించాలని, చిరుతకు ఎలాంటి హాని కలగకుండా సురక్షితంగా పట్టుకుని తిరిగి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని పవన్ దిశానిర్దేశర చేశారు. జూ సిబ్బంది సహకారం తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. రెస్క్యూ సందర్భంగా విద్యార్థులు, విశ్వవిద్యాలయం సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చిరుత సంచారంపై ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎంవో సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

# రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- వంద యూనికార్న్ సంస్థల ఏర్పాటు లక్ష్యం
- విలేజ్ టూ గ్లోబల్ మా ప్రభుత్వ నినాదం
- దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలలే ఊతం
- విజయవాడ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్‌లో చంద్రబాబు




**అమరావతి, మే 25:** రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ అని.. దీనిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమని ఉద్ఘాటించారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు.. మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందని వివరించారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ - 2026 జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) వెన్నెముక అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ రంగం యువత కలలకు వేదికని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్‌లో స్టాళ్లను సందర్శించి, స్టార్టప్ సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం 38 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ అని అన్నారు. మహిళా ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసేది ఎంఎస్ఎంఈలే. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదిక కావాలి. ఈ వేదిక ద్వారా అనేక ఒప్పందాలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో కోటి ఎంఎస్ఎంఈలు ప్రారంభం కావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 550 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు వస్తున్నాయి. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదికలు కావాలని చంద్రబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరిట ఓ కళావేదికను ఇవాళ ప్రారంభించు కుని ఎంఎస్ఎంఈ సమ్మిట్ - 2026 నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 4.4 ఎకరాల్లో 1.45 చదరపు అడుగుల స్థలంలో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని తెలిపారు. ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని చెప్పుకొచ్చారు. ఏపీలో వనరులు వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదికపైకి వచ్చాయని వివరించారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. రూ.500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామని చెప్పుకొచ్చారు. రూ.200 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని వివరించారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వందపార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామని ప్రస్తావించారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామని స్పష్టం చేశారు. శ్రీసిటీ విజయవంతమైన పారిశ్రామిక పార్క్ అని చెప్పుకొచ్చారు. రూ.28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యూర్లుగా మారుస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు టిజి భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, శ్రీనివాస్, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు 10కోట్ల మంది

**అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి**

**రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 25:** గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల-2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అధికారుల పనితీరుపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రూ.8,600 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. ఒకే సంవత్సరంలో 7 వేల పనులను ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా పుష్కరాల నిర్వహణలో టూరిజం శాఖ నుంచి సరైన సన్నద్ధత ఎందుకు కనిపించడం లేదని మందలించారు. ఇష్టానుసారంగా ఖర్చు పెడదామని అనుకుంటే కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో పనులు చేయాలని దిశానిర్దేశర చేశారు. హడావిడిగా పాచిపోయిన సిమెంట్‌తో పనులు చేస్తే అవి కూలిపోతాయని హెచ్చరించారు. గత పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాట వంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రికే పరిమితం కాదని, 6 జిల్లాల్లోని 274 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భక్తులకు సమాన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల సన్నద్ధతపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర నిధుల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లే సమయంలో అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో భక్తులు మురికినీళ్లలో స్నానం చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అలాగే, తూర్పుగోదావరి జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గోదావరి నది కాలుష్యానికి కారణాలపై ఆరా తీశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమ వ్యర్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో కలవకూడదని హుకుం జారీ చేశారు. పరిశ్రమ వ్యర్థాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలుషిత నీరు సాగునీటి కాలువల్లో కలవకుండా చర్యలు చేపట్టాలని మార్గనిర్దేశర చేశారు. మురుగునీటిని శుద్ధి చేశాకే నదులు, కాలువల్లో కలపాలని సూచించారు. మురుగునీటి హాట్ స్పాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని నిర్దేశిరచారు. కాలుష్య నివారణకు కలెక్టర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీల్లో మురుగునీరు ఎందుకు శుద్ధి చేయట్లేదని ప్రశ్నించారు. మురుగునీటిని నేరుగా పంట కాలువల్లో ఎందుకు కలిపేస్తున్నారని నిలదీశారు. నదిలో, తాగునీటిలో మురుగునీటిని కలపడం సరికాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# పదవుల కోసం వారు అక్కర్లేదు

**పార్టీ కోసం, ఎపి అభివృద్ధి కోసం పనిచేయండి**

**ఎదుటి వారి విమర్శలను సహించడానికి లేము**

**అవసరమైతే తాట తీస్తాం: పవన్ హెచ్చరిక**



**అమరావతి,మే25:**పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

# మహిళల భద్రత కోసం "షీ" టీమ్ ప్రత్యేక చర్యలు

- పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు
- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం



**దోమ మండలం, మే,25(సమయం న్యూస్) :** మహిళలు, బాలికల భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న "షీ" టీమ్ సమర్థవంతంగా సేవలందిస్తోందని పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు అన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అదేశాలమేరకు దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొత్కూర్ దగ్గర పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు ఆద్వర్యంలో సోమవారం ఉపాధి హామీ కార్మికులకు మహిళల పై జరుగుతున్న నెరలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కార్మికులకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, "షీ" టీమ్ హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అలాగే సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం. 1930) సమగ్ర అవగాహన కల్పించారు. మహిళలు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు, "షీ" టీమ్ సభ్యులు బి.సావిత్రి,పాల్గొన్నారు.

# పోషకాహార మేళ ద్వారా గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి.



**సిద్ధిపేట మే25( సమయం న్యూస్). :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో నిర్వహించిన పోషకాహార మేళ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార మేళలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రదర్శించిన పలు పోషకాహార పదార్థాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి రుచి చూశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు ఇలాంటి పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన పలు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రతి వారం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వారం మహిళా మరియు శిశు సంక్షేమ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్న భాగంగా పోషకాహార మేళ నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం గర్భిణీ మహిళలు, చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధక ఆహార పదార్థాలను అందిస్తోందని తెలిపారు. ప్రజలు, అధికారులు పోషకాహారం ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు ఈ మేళ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. గర్భిణీలు ఆకుకూరలు, పండ్లు, ప్రకృతిలో లభించే వివిధ రకాల పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వగలరని తెలిపారు. శిశువు జననం అనంతరం కూడా కొన్ని వారాల పాటు ప్రభుత్వం ఉచితంగా పోషకాహారం అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ శారద, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, సీపీఓ దశరథం, డిహెచ్ఓ సువర్ణ, డిటిసిపిఓ రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొస్గి

- ప్రభుత్వ పాలిటెక్నీక్ కళాశాల,కోస్గి ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం.శ్రీనివాసులు




**కోస్గి మున్సిపల్,(మం)మే,25(సమయం న్యూస్) :** పాలిటెక్నిక్ కళాశాలలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్--2026 వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 27వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొస్గి ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చున్నారు. మే 27 నుండి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ (Mee Seva) ద్వారా ఫీజు చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. మే 29 నుండి జూన్ 1వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించబడుతుందని, మే 29 నుండి జూన్ 3వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కొస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ మరియు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కళాశాల పనిచేస్తోందన్నారు.

అలాగే ఈ విద్యాసంవత్సరానికి ప్రత్యేకంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొస్గిలో హెల్ప్ లైన్ సెంటర్ (HLC) ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. పాలిసెట్ విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదు, కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన సందేహాల నివృత్తి తదితర సేవలను ఈ హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా పొందవచ్చున్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు క్రింది సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు:

పాలిసెట్ హాల్ టికెట్ & ర్యాంక్ కార్డ్
SSC మెమో / సమాన అర్హత పరీక్ష మెమో
ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (TC)
ఆధార్ కార్డు
ఆదాయ ధృవీకరణ పత్రం -- 2026
కుల ధృవీకరణ పత్రం (SC/ST/BC విద్యార్థులకు)
నివాస ధృవీకరణ పత్రం
4 నుండి 10వ తరగతి వరకు బోనాఫైడ్ సర్టిఫికెట్లు

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు tgpolycet.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొస్గిలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాసులు కోరారు.

# శ్రీ బీరప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి





**కల్లూరు, మే 25(సమయం న్యూస్) :** పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కురుమల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన శ్రీ బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తీవ్ర ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, మే 25:( సమయం న్యూస్ )**జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బ ప్రమాదం అధికంగా ఉన్నందున ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అలాగే పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లను తీసుకోవాలని పేర్కొన్నారు. బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ, తడి గుడ్డ వంటివి ఉపయోగించాలని, లేత రంగు దుస్తులు ధరించాలని సూచించారు. వీలైనంత వరకు చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. మద్యం, కాఫీ వంటి డీహైడ్రేషన్‌కు కారణమయ్యే పానీయాలను నివారించాలని, చిన్నపిల్లలు, వృద్ధులను ఎండలో ఎక్కువసేపు ఉంచవద్దని హెచ్చరించారు. పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను ఒంటరిగా వదిలి పెట్టవద్దని సూచించారు. వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, చల్లటి నీటితో శరీరాన్ని తడపాలని తెలిపారు. అవసరమైతే ఓఆర్ఎస్ ద్రావణం ఇచ్చి సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విజ్ఞప్తి చేశారు.

# జీహెచ్ఎంసీ ప్రజావాణికి తగ్గిన స్పందన

- కమిషనర్ గైర్హాజరు.. ప్రజల్లో నిరాశ



**హైదరాబాద్ మే25( సమయం న్యూస్)** జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఇటీవలి కాలంలో ప్రజల స్పందన తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించకపోవడం, అధికారులు ఫిర్యాదులను ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులను జీహెచ్ఎంసీ అధికారులు కలెక్టరేట్‌కు, అక్కడి అధికారులు మళ్లీ జీహెచ్ఎంసీకి పంపుతున్న పరిస్థితి ఉందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమస్యల పరిష్కారం కంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక ప్రజావాణి కార్యక్రమానికి కమిషనర్ హాజరు కాకపోవడం కూడా ప్రజల్లో నిరాశ కలిగిస్తున్న అంశంగా మారింది. ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా వినిపించుకోకపోవడంతో ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతుండటంతో ప్రజావాణికి వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. మధ్యాహ్న వేళల్లో బయటకు రావడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో హాజరు తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

# పేదల గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేకపోతోంది : బీఆర్ఎస్ విమర్శ

**హైదరాబాద్, మే 25 సమయం న్యూస్) :**కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పేదల పరిస్థితి దారుణంగా మారిందని బీఆర్ఎస్ విమర్శించింది. కుటుంబ సభ్యులే మృతదేహాలను భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొంది. K. Chandrashekar Rao హయాంలో పేదల చివరి ప్రయాణం గౌరవంగా సాగేందుకు ప్రత్యేక పార్థివ దేహాల తరలింపు వాహనాలు ఏర్పాటు చేశారని గుర్తుచేసింది. కానీ ప్రస్తుతం కనీస అత్యవసర సేవలు కూడా ప్రజలకు అందడం లేదని ఆరోపించింది. ప్రచారాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని, ఇదేనా కాంగ్రెస్ చెప్పిన మార్పు అంటూ బీఆర్ఎస్ ప్రశ్నించింది.

# వినోద రంగంలో బాల కార్మికుల నిషేధంపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ మే25( సమయం న్యూస్) :** వినోద రంగం, దానికి అనుబంధంగా ఉన్న సంస్థల్లో బాల కార్మికులపై కఠిన నిషేధం అమలు చేయాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఆర్కెస్ట్రాలు, డాన్స్ బార్లు, డాన్స్ బృందాలు, నాటంకీ ప్రదర్శనలు, మసాజ్ పార్లర్లు, స్పాలు, సెలూన్లలో చిన్నారుల దోపిడీ జరుగుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇలాంటి ప్రదేశాల్లో పిల్లలు శారీరక, మానసిక, ఆర్థిక దోపిడీకి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. బాలల రక్షణ, కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ఈ అంశంపై సమాధానం దాఖలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# రోహిణి కార్తె 2026 ప్రత్యేక సమాచారం.

**(సమయం న్యూస్) :** రోహిణి కార్తె అనేది భారతీయ ఖగోళ మరియు పంచాంగ పరంగా ఎంతో ముఖ్యమైన కాలంగా భావించబడుతుంది. ఈ సమయంలో సూర్యుడు రోహిణి నక్షత్రం లో సంచరిస్తాడు. అందువల్ల భూమిపై ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరుకుంటాయి. 2026 సంవత్సరంలో రోహిణి కార్తె..మే 25,2026 (సోమవారం) ప్రారంభమవుతుందిజూన్ 8, 2026 వరకు కొనసాగుతుంది

రోహిణి కార్తె ప్రత్యేకతలు..

సంవత్సరంలో అత్యంత వేడిగాలులు వీచే కాలం ఇదే
మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతాయిబి
గ్రామీణ ప్రాంతాల్లో బావులు, చెరువులు ఎండిపోవడం సాధారణం
రైతులు వర్షాకాలం కోసం భూమిని సిద్ధం చేసే సమయం
ఈ కాలం తర్వాత మృగశిర కార్తె ప్రారంభమై వర్షాల సూచనలు కనిపిస్తాయి
పెద్దలు చెప్పే మాట ☞"రోహిణి ఎండలు రాళ్లను కూడా పగలగొడతాయి అంటే ఈ కాలంలో ఎండ తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటుందో తెలియజేస్తుంది.

ఆరోగ్య జాగ్రత్తలు :

ఎక్కువగా నీరు తాగాలి
మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలి
మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తీసుకోవాలి
పిల్లలు మరియు వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి

వ్యవసాయ పరంగా ప్రాముఖ్యత:

రైతులు విత్తనాలు సిద్ధం చేసుకునే సమయం
మృగశిర వర్షాలకు ముందు భూమి దున్నే పనులు చేపడతారు
వర్షాకాల పంటల ప్రణాళికలు ప్రారంభమవుతాయి
రోహిణి కార్తె ముగిసిన తర్వాత మృగశిర కార్తె ప్రారంభమై వర్షాల ఆరంభానికి సంకేతంగా భావిస్తారు

## ప్రజా వినతులను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కమిషనర్ చంద్రశేఖర్
- నగర ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరణ....
- వివిధ విభాగాలకు చెందిన 103 ఫిర్యాదుల స్వీకరణ....



**గ్రేటర్ హైదరాబాద్ మే25( సమయం న్యూస్). :** ప్రజావినతులను( ఫిర్యాదులను) తక్షణమేపరిష్కరించాలని అదనపు కమిషనర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు.

సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం ను పురస్కరించుకొని అదనపు కమిషనర్ తో పాటు ఆయా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం వెటర్నరీ వైద్యులు డా. గోపాల్ రావు డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి పన్నుల అధికారి రామకృష్ణ ఎం హెచ్ ఓ డా. రాజేష్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- ప్రజావాణి కార్యక్రమానికి ప్రధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించలి
- జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట, మే.25(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. సమీకృత ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు పోష్ చట్టం రక్షణ కవచం

- కలెక్టర్ హేమంత్ సహదేవరావు





**ములుగు, మే 25( సమయం న్యూస్) :** పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం--2013 (పోష్ చట్టం) మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు తప్పనిసరి అని చెప్పారు. బాధిత మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం పోష్ చట్టం, పోషకాహార పోస్టర్లను ఆవిష్కరించి, మహిళా భద్రతపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేస్తే చంద్రబాబు ఇంటి ముట్టడి: కవిత హెచ్చరిక

**హైదరాబాద్ మే25( సమయం న్యూస్). :** హైదరాబాద్: ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఏపీ ప్రభుత్వం కేసులు పెట్టడం అప్రజాస్వామికమని, భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు ప్రయత్నిస్తే హైదరాబాద్‌లోని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజకీయ విశ్లేషణలతో ఏకీభవించకపోతే ఖండించాలి కానీ కేసులు పెట్టడం సరికాదని అన్నారు. నాగేశ్వర్‌కు అండగా ఉంటామని, తెలంగాణ పోలీసులు ఏపీ పోలీసులకు సహకరించవద్దని సూచించారు. మరోవైపు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ వాహనం ఇవ్వకపోవడంతో మృతదేహాన్ని కుటుంబసభ్యులు భుజాలపై మోసుకెళ్లిన ఘటన అమానవీయమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సెన్సస్ గణన ప్రక్రియను కచ్చితత్వంతో పూర్తి చేయాలి

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**హైదరాబాద్, మే 25( సమయం న్యూస్).** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని తుక్కుగూడ ప్రాంతంలో కొనసాగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ మరియు బిఎల్ఓ కార్యకలాపాలను జిహెచ్ఎంసి కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం తనిఖీ చేశారు. మార్కెట్ లేన్ వెనుక ఉన్న హెచ్ఎల్‌బి నెం.29, 30 ప్రాంతాలను సందర్శించిన కమిషనర్ క్షేత్రస్థాయి గణన ప్రక్రియను సమీక్షించారు. సెన్సస్, ఎస్ఐఆర్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు కచ్చితమైన, క్రమబద్ధమైన డేటా సేకరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణన సిబ్బంది, పర్యవేక్షకులతో మాట్లాడిన కమిషనర్ ఇళ్ల జాబితా, ధృవీకరణ విధానాలను పరిశీలించారు. క్షేత్రస్థాయి విధుల్లో పురోగతి, సమయపాలన, సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హాజరు, సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అత్యంత కచ్చితత్వంతో గణన పనులను పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం

-- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ మే25( సమయం న్యూస్) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సి ఈ వో ఎల్లయ్యా, ఆర్ ఢ బీ శాఖ అధికారి వేణు, జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డి ఎస్పీ లు ,జాతీయ రహదారి అధికారులు ,రవాణా శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషన్లు ,పాల్గొన్నారు.

# OMIF ఆధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వ పతాకాల పై అవగాహన

- జిల్లా కోఆర్డినేటర్ కె.నారాయణ





**జడ్చర్ల మండలం, మే,25(సమయం న్యూస్) :** జడ్చర్ల మండలం నాగసాల గ్రామంలో సోమవారం నాడు OMIF ఆధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వ పతాకాల పై జిల్లా కోఆర్డినేటర్ కె నారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. OMIF ఉమ్మడి జిల్లాలో 350 గ్రామ లలో జోగిని వ్యవస్థ నిర్మూలన ఆరోగ్యశీ మహిళా సంక్షేమం బాల్య వివాహాలు కుట్టుశిక్షణ కేంద్రాలను జిల్లాలో 10 సెంటర్ లను ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు లు కలిగి ఉండాలి అని సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లలకు మంచి పథకం అందరు పోస్ట్ ఆఫీస్ లో వివరాలు తెలుసుకావాలని ఇశ్రమ కార్డు కూడా తీసుకోవాలని పేద ప్రజలకు వీటి గురించి తెలుసుకుంటే లబ్ది పొందవచ్చని అవేర్నెస్ కల్పించడం జరిగింది సఖి కేంద్రం నుంచి మహిమ శిరి మాట్లాడుతూ మహిళలకు సమస్యలు ఉంటే 181 కీ. టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ ద్వారా వివరాలు చెప్పాలని మహిళలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రభుత్వం కల్పించే పథకాలను సద్వినియొగం చేసుకొవాలని మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో ూవీ×ఖీ మండల కోఆర్డినేటర్ రాములు ఆరోగ్య కార్యకర్తలు రాధా సుజాత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జగన్ అంగన్వాడీ టీచర్ ఐద్వా సంఘం మహిళలు గ్రామ మహిళా సంఘం అధ్యక్షులు గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు

# రాయపోల్ ఎంపీడీవో కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది కొరత

### టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌ను కేటాయించాలని విజ్ఞప్తి.



**రాయపోల్, మే 25:** రాయపోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం తీవ్ర సిబ్బంది కొరత వేధిస్తుంది. పరిపాలనపై ప్రభావం పడుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా, 3,833 జాబ్ కార్డులు, 6,344 మంది కూలీలు ఉన్నారు. అయితే ఇంత పెద్ద పరిధికి కేవలం ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు 10 గ్రామ పంచాయతీలకు, మరొకరు 9 గ్రామ పంచాయతీలకు బాధ్యతలు చేపడుతున్నారు. అదేవిధంగా 19 గ్రామ పంచాయతీలకు కేవలం ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే ఉండగా, ఇన్‌చార్జి ఏపీఓతోనే కార్యాలయ పాలన కొనసాగుతోంది. దీంతో ఉపాధి హామీ పనులు, సాంకేతిక సేవలు, రికార్డుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి రాయపోల్ మండలానికి అదనంగా ఒక టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంటనే కేటాయించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటకు ఘన శ్రీకారం

- జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ
- "బడిమానేసిన ప్రతి చిన్నారి మళ్లీ బడిబాట పట్టాలి"
- అధికారులకు జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్ స్పష్టమైన ఆదేశాలు



**నారాయణపేట, మే,25(సమయం న్యూస్) :** జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో బడిబాట కార్యక్రమ అమలు, నమోదు లక్ష్యాలు, గ్రామస్థాయి ప్రచార కార్యక్రమాలు, పాఠశాలల సిద్ధతపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో బడిమానేసిన పిల్లలు, ఇప్పటివరకు ఏ పాఠశాలలోనూ నమోదు కాని విద్యార్థులు, బడి ఈడు గల బాలబాలికలను ప్రత్యేక సర్వేల ద్వారా గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గ్రామాలు, తండాలు, కాలనీల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

"ప్రతి పాఠశాల -- ప్రత్యేక కార్యాచరణ"

గత మూడు సంవత్సరాల నమోదు వివరాలను విశ్లేషించి ఈసారి మరింత మెరుగైన నమోదు సాధించేలా ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అవకాశం ఉన్న పాఠశాలల్లో అధిక శాతం నమోదు పెరిగేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ -- ఆన్లైన్ నమోదు

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, ఇంగ్లీష్ మీడియం, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాలు వంటి సౌకర్యాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి వెంటనే పాఠ్యపుస్తకాలు అందజేసి, సంబంధిత వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రజా భాగస్వామ్యంతో బడిబాట

బడిబాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆలుమ్ని కమిటీలు, ఆప్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామ సభలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, తల్లిదండ్రుల సమావేశాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను ప్రజలకు చేరవేయాలని తెలిపారు.

దశలవారీగా బడిబాట కార్యక్రమాలు

బడిబాట కార్యక్రమంలో భాగంగా మే 14న తల్లిదండ్రులు, స్వయం సహాయక సంఘాలు, ఆప్ కమిటీ సభ్యులతో సమావేశాలు, మే 21న అంగన్వాడీ టీచర్లు మరియు తల్లుల కమిటీలతో సమావేశాలు, మే 28న యువత మరియు గ్రామ నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు. జూన్ 3న గ్రామసభలు, జూన్ 4 నుంచి 10 వరకు ఇంటింటి సర్వేలు, విద్యార్థుల నమోదు కార్యక్రమాలు చేపట్టనున్నారు. జూన్ 12 నుంచి 19 వరకు పాఠశాల స్థాయిలో స్వాగత కార్యక్రమాలు, ఫౌండేషన్ లిటరసీ, ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్, డిజిటల్ అవగాహన, క్రీడా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు సమావేశంలో వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న డిజిటల్ తరగతులు, క్రీడా సదుపాయాలు, లైబ్రరీలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, కెరీర్ గైడెన్స్, విద్యార్థుల సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజు, వివిధ జిల్లా శాఖల అధికారులు, సీఎంఓ రాజేంద్రకుమార్, ఏ ఎమ్ ఓ విద్యాసాగర్ మరియు జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పేరుకుపోతే.. రైతు కష్టాన్ని పట్టించుకునేది ఎవరు..?

## లారీలు లేక రోడ్డెక్కిన ముంగాజ్‌పల్లి రైతులు

**రాయపోల్, మే 25:** పంట పండించేందుకు ఏడాది పొడవునా శ్రమించిన రైతుకు చివరికి ధాన్యం అమ్ముకునే సమయంలోనే కష్టాలు తప్పడం లేదు. రాయపోల్ మండలం ముంగాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వడ్లు తరలించేందుకు లారీలు రాకపోవడంతో సోమవారం గజ్వేల్-చేగుంట ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వడ్లు పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లు అమ్ముకోవడానికి రైతులు కేంద్రాల చుట్టూ తిరుగుతుంటే, ప్రభుత్వం మాత్రం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం ఎండల్లో, వర్షాల్లో పాడైపోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇదిలా ఉండగా, వీరానగర్ గ్రామంలోని రైస్‌మిల్లు యజమాని స్థానిక రైతుల ధాన్యాన్ని పక్కనపెట్టి ఇతర గ్రామాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాడని రైతులు ఆరోపించారు. "మా గ్రామంలోనే వడ్లు పేరుకుపోయి ఉంటే బయట గ్రామాల ధాన్యం ఎందుకు కొనుగోలు చేస్తున్నారు..?" అంటూ ప్రశ్నించారు. స్థానిక రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో దాదాపు రెండు గంటల పాటు గజ్వేల్-చేగుంట రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస, ఏపీఎం యాదగిరి అక్కడికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



# యాలాల్‌లో రూ.30 లక్షల ఐకేపీ స్టోరేజ్ గోదాంకు భూమిపూజ.

- గ్రామ సర్పంచ్ సీ. హెచ్. శివయ్య ఆధ్వర్యంలో..
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా



**యాలాల మండలం, మే,25(సమయం న్యూస్) :** తాండూర్ నియోజక వర్గం లోని యాలాల్ మండల కేంద్రం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఐకేపీ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ సీహెచ్. శివయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనంద్ రావు, ఉప సర్పంచ్ శోభారాజు రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, సీసీ వెంకటేష్‌లతో పాటు వార్డు సభ్యురాలు అశ్విని, గడ్డం రాములు గౌడ్, మ్యాదరి వేణు, రాజు రెడ్డి, ఎల్లప్ప, సరిత, రాణిమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివయ్య మాట్లాడుతూ, ఈ గోదాం నిర్మాణం పూర్తైతే ధాన్యం నిల్వకు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.



**నారాయణపేట, మే,25(సమయం న్యూస్) :** ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం అని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ఆడపిల్లలు మంచిగా చదువుకుని తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని సమాజంలో పేరు తెచ్చుకోవాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గత 15 రోజులుగా కొనసాగిన సమ్మర్ స్పార్క్ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్రైబల్ పెయింటింగ్/ క్రాఫ్ట్, పిక్చర్ టాక్, యంగ్ ఒరేటెడ్ సోకేజ్, కమ్యూనికేషన్ ఇంగ్లీష్, స్పీడ్ మ్యాస్ లలో జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రదర్శనలను కలెక్టర్ చూసి విద్యార్థినులను అభినందించారు. వారిలోని ప్రతిభ పాటవాలను పరీక్షించారు. రాష్ట్రస్థాయిలో కస్తూర్బా విద్యార్థులు ఇంటర్మీడియట్లో మంచి ప్రతిభ చాటారని ఆమె తెలిపారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి ఫలితాలలోను వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. వాస్తవానికి వేసవి సెలవులు విద్యార్థులకు ఎంతో ముఖ్యమని, కానీ ఆ సెలవులను ఇలాంటి క్యాంప్ లలో సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఎంతో గొప్ప స్థాయికి ఎదగవచ్చని కలెక్టర్ తెలిపారు. మంచి కోర్సులలో శిక్షణ పొందిన విద్యార్థిను లు భవిష్యత్తులో మెరుగైన శిక్షణ పొందితే ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించవచ్చనీ ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో గోవింద రాజులు, డీసీ డిఓ సంగీత, ఎంఈవో బాలాజీ, సెక్టోరియల్ అధికారి నాగార్జున రెడ్డి, ఆ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరిగిన ఇంధన డిమాండ్..

- నిరంతర సరఫరా కొనసాగిస్తున్న ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థలు
- మే నెలలో డీజిల్ అమ్మకాలు 12.6 శాతం, పెట్రోల్ అమ్మకాలు 9 శాతం పెరుగుదల
- రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షలకు పైగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా

**హైదరాబాద్ మే25( సమయం న్యూస్). :** తెలంగాణ రాష్ట్రంలో పెరిగిన ఇంధన డిమాండ్‌కు అనుగుణంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరాను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు వెల్లడించాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలు సమన్వయంతో 24 గంటల పాటు కార్యకలాపాలు నిర్వహిస్తూ సరఫరాను పర్యవేక్షిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ధాన్యం కొనుగోలు, వ్యవసాయ పనులు, కోతల సీజన్ వేగంగా సాగుతుండటంతో డీజిల్, పెట్రోల్ వినియోగం గణనీయంగా పెరిగినట్లు పేర్కొన్నారు. పోటీ ధరల కారణంగా ఇతర సంస్థల వినియోగదారులు కూడా ప్రభుత్వ రంగ పెట్రోల్ బంకుల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మే 2026లో తెలంగాణలో డీజిల్ రిటైల్ అమ్మకాలు 12.6 శాతం, పెట్రోల్ రిటైల్ అమ్మకాలు 9 శాతం మేర పెరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో డీజిల్ అమ్మకాలు 25 శాతానికి పైగా పెరగగా, మరో 12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం వరకు వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఇక మే నెలలో రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షలకు పైగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేసినట్లు ఆయిల్ సంస్థలు వెల్లడించాయి. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలను నిరంతరం సమీక్షిస్తూ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయిల్ సంస్థలు స్పష్టం చేశాయి. ఇంధన లభ్యతకు సంబంధించి అధికారిక సంస్థలు విడుదల చేసే సమాచారాన్నే ప్రజలు విశ్వసించాలని సూచించాయి.

# ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

- ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని రైతు విజ్ఞప్తి.



**రాయపోల్, మే 25:** రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి గ్రామ శివారులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సొక్కం స్వామి వ్యవసాయ పొలం వద్ద ఈ విద్యుత్ తీగలు నేలకు అత్యంత సమీపంగా ఉండడం వల్ల ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రమాదం మరింత పెరిగే అవకాశముందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి వేలాడుతున్న తీగలను సరిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం

- జిల్లా ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్




**నారాయణపేట, మే,25(సమయం న్యూస్) :** కాంటాక్ట్ నంబర్: 0850-6281182

నేడు మంగళవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో భాగంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆధ్వర్యంలో "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమం నిర్వహించబడుతుంది. ప్రజలు, ఫిర్యాదుదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు తెలియజేయదలచిన వారు ఎస్పీ కార్యాలయ ఫోన్ నంబర్: 0850-6281182 కు మే 26వ తేదీ ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు కాల్ చేయవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు స్వీకరించి తక్షణ పరిష్కార మార్గాలను సూచిస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

# రైతును మోసం చేస్తే ఊరుకోం..!

- రాయపోల్‌లో విత్తన దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు



**రాయపోల్, మే 25:** ఖరీఫ్ సీజన్ మొదలవుతుండటంతో రైతును నకిలీ విత్తనాల బారిన పడనివ్వబోమన్నట్టుగా అధికారులు రంగంలోకి దిగారు. రాయపోల్ మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి డీలర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

ఆగ్రో రైతు సేవా కేంద్రం--1, అడిషనల్ ఆగ్రో రైతు సేవా కేంద్రం--2తో పాటు అనాజిపూర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ట్రేడర్స్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ఎస్ఐ కె. మానస సంయుక్తంగా సోమవారం తనిఖీ చేశారు. లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లుబుక్స్‌ను పరిశీలించి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. "రైతుకు అమ్మే ప్రతి గింజకు బాధ్యత ఉండాలి.. ప్రతి అమ్మకానికి రశీదు ఇవ్వాలి.. ధరల జాబితా ప్రజలకు కనిపించేలా పెట్టాలి" అంటూ డీలర్లకు స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన స్టాక్ లేదా అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే పీడీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# పేటను ఆరోగ్య జిల్లాగా మార్చుదాం.

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.**





**నారాయణపేట, మే,25(సమయం న్యూస్) :** జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించి,సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా మార్చేందుకు మనమంతా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పోలేపల్లి ఫంక్షన్ హాల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ..ఉమ్మడి పాలమూరు జిల్లాలో బాల్య వివాహాలు మన నారాయణ పేట జిల్లాలోనే ఎక్కువగా ఉన్నాయని, వాటిని నిర్మూలించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు.గ్రామాల్లో అంగన్ వాడీ టీచర్ల పాత్ర కీలకమన్నారు.అంతకు ముందు అంగన్ వాడీ టీచర్ల పౌష్టికాహార ఫ్లకార్డుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అలాగే స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పోషకాహార పదార్థాల తయారీ ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చింది. సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్,మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పుర వైస్ చైర్మన్ మంజుల, కమిషనర్ శంకర్, కౌన్సిలర్లు అరుణ, సత్యమ్మ మెప్మా అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి
- జ్యోతి ప్రజ్వలనతో మహిళా వారోత్సవాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్



**కుల్కచర్ల మండలం, మే,25(సమయం న్యూస్) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ వంటకాల ప్రదర్శనను వీక్షించి,"సే నో టు జంక్ ఫుడ్" పై మహిళలకు అవగాహన కల్పించారు.ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించాలని సూచించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళా, శిశు సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు.మహిళా సాధికారతే సమాజ అభివృద్ధికి మూలస్తంభమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**




**నిర్మల్ మే25( సమయం న్యూస్) :** జూన్ 02 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టరేట్ లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు.జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసిన సీపీ



**హన్మకొండ మే25( సమయ్దం న్యూస్).:** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై హనుమకొండ నగరానికి తొలిసారిగా విచ్చేసిన సీనియర్ నాయకుడు వేం నరేందర్ రెడ్డిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలియజేశారు. నేరాల నియంత్రణతో పాటు, శాంతి భద్రతల పరిరక్షణకై చేపడుతున్న ముందస్తు చర్యల పై పోలీస్ కమిషనర్ రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి వివరించారు.

## ఆటల్లో ఆనందం.. కళల్లో ప్రతిభ..

- వేసవి క్యాంపుకు గ్రాండ్ ముగింపు



**రాయపోల్, మే 25:** ప్రభుత్వ పాఠశాల అంటే కేవలం పుస్తకాల చదువే కాదు.. పిల్లల ప్రతిభకు వేదిక కూడా అని నిరూపిస్తూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 15 రోజుల వేసవి క్యాంపు సందడి మధ్య ముగిసింది. చివరి రోజు చిన్నారులు చూపించిన యోగా విన్యాసాలు, ఏరోబిక్ డాన్స్, కోలాటం, కంప్యూటర్ నైపుణ్యాలు, ఎంబ్రాయిడరీ కళలు తల్లిదండ్రులు, అతిథులను ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి లావణ్య విద్యార్థుల ప్రతిభను అభినందించారు. "గ్రామీణ పిల్లల్లో దాగి ఉన్న టాలెంట్‌ను బయటకు తీసేది ఇలాంటి క్యాంపులే" అని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, క్రమశిక్షణ పెంచడంలో వేసవి క్యాంపులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు వైష్ణవి, కంప్యూటర్ ట్రైనర్ మంజుల, ఎంబ్రాయిడరీ శిక్షకురాలు మహేశ్వరి, ఉపాధ్యాయుడు అంజిరెడ్డి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## రియల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో "గ్రోత్ కాన్‌క్లేవ్ 2026" పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్, మే 25 :** రియల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రియల్టర్స్ గ్రోత్ కాన్‌క్లేవ్ 2026" కార్యక్రమ పోస్టర్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగన్ గురు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఫౌండర్ ఉరుకుంద శెట్టి నాయకత్వం వహించారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సురేష్ కుమార్, మల్లేష్ యాదవ్, విజయేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి, వ్యాపార అవకాశాలు, నెట్‌వర్కింగ్ మరియు మార్కెటింగ్ నైపుణ్యాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కాన్‌క్లేవ్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జగన్ గురు మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో ముందుకు రావాలని, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్‌కు దోహదపడతాయని అన్నారు. ఫౌండర్ ఉరుకుంద శెట్టి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు సభ్యులు, ఆహ్వానితులు మరియు రియల్ ఎస్టేట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వీరారెడ్డిపల్లిలో పోచమ్మ పండుగకు సర్వం సిద్ధం



**రాయపోల్, మే 25:** రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో గురువారం జరగనున్న పోచమ్మ పండుగకు గ్రామం మొత్తం భక్తి శోభతో ముస్తాబైంది. గ్రామ సర్పంచ్ రొయ్యల సుగుణ ఆధ్వర్యంలో పండుగ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏడాది గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా జరిగే ఈ పండుగను ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.పోచమ్మ తల్లికి మహిళలు సంప్రదాయ బోనాలు సమర్పించనుండగా, డప్పు వాయిద్యాలు, బోనాల ఊరేగింపులు, ప్రత్యేక పూజలతో గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోనుంది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తుల కోసం తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు, పంటల సమృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు కలగాలని గ్రామస్తులు ప్రార్థించనున్నారు.

## ప్రజావాణికి గైర్హాజరు అయిన అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి షోకాజ్ నోటీసులు జారీ

**వికారాబాద్, మే,25(సమయం న్యూస్) :** ప్రజావాణికి గైర్హాజరు అయిన అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగింది.విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడం,విధులకు హాజరు కాకపోవడంపై డిసిహెచ్ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆనంద్, ఎంసిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్,108 కోఆర్డినేటర్ బి.రఘురాం లకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వివరణ కోరడం జరిగింది.ముందస్తు అనుమతి పొందకుండా ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనట్లు అందువల్ల విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడానికి గల కారణాలను తెలుపుతూ లిఖితపూర్వక వివరణను సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వనట్లయితే సస్పెన్షన్‌తో సహా క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.వివరణలో జాప్యం చేసినట్లయితే తదుపరి నోటీసు లేకుండా, అమలులో ఉన్న నియమ, నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అంతేకాక, అదే విషయం మళ్ళీ పునరావృతమైతే పని చేయడానికి ఆసక్తి లేదని భావించి, ఆ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు ద్వారా తెలిపారు.

# ప్లేఆఫ్స్‌కు రంగం సిద్ధం





ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ముంబై ఇండియన్స్‌పై రాజస్థాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో టాప్-4 లో నిలిచి చివరి ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్లతో తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, రాజస్థాన్ అద్భుత ప్రదర్శనతో ఆ రెండు జట్లను రేసు నుండి పూర్తిగా తప్పించింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లతో కలిసి రాజస్థాన్ రాయల్స్ నాకౌట్ దశకు చేరుకోవడంతో ఈ సీజన్ లీగ్ మ్యాచ్‌ల ఉత్కంఠ ముగిసింది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో కేవలం 15 బంతుల్లోనే 32 పరుగులు బాదడమే కాకుండా, బౌలింగ్‌లో 4 ఓవర్లలో 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 205 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ 175 పరుగులకే పరిమితమైంది. ముంబై బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 60 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. మే 26 తేదీన ధర్మశాల వేదికగా జరిగే క్వాలిఫైయర్-1 మ్యాచ్‌లో పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఆ తర్వాత మే 27 తేదీన ముల్లాన్‌పూర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో నాలుగో స్థానంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఢీకొంటుంది. ఇందులో ఓడిన జట్టు టోర్నీ నుండి నిష్క్రమిస్తుంది. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు, క్వాలిఫైయర్-1 లో ఓడిన జట్టుతో మే 29 తేదీన ముల్లాన్‌పూర్‌లోనే క్వాలిఫైయర్-2 మ్యాచ్ ఆడుతుంది. ఇందులో విజేతగా నిలిచిన జట్టు మే 31 తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే గ్రాండ్ ఫైనల్‌లో టైటిల్ కోసం పోరాడుతుంది. నిజానికి ఈ ఏడాది ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో జరగాల్సి ఉన్నప్పటికీ, కొన్ని స్థానిక భద్రతా కారణాల వల్ల బీసీసీఐ ఈ వేదికను అహ్మదాబాద్‌కు మారుస్తూ గతంలోనే నిర్ణయం తీసుకుంది.




## ఎస్ఆర్‌హెచ్‌పై అక్షర్ ప్రశంసలు

హైదరాబాద్, మే 25 : ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ పోరు ఉత్కంఠభరితంగా మారుతున్న వేళ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ అత్యంత ప్రమాదకర జట్లలో ఒకటిగా నిలిచిందని, వారి దూకుడైన బ్యాటింగ్‌ను అడ్డుకోవడం చాలా కష్టమని అక్షర్ పేర్కొన్నారు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో ఎస్ఆర్‌హెచ్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్లు టాప్ టెన్‌లో ఉండటం జట్టు బలాన్ని చూపిస్తోందని ఆయన అన్నారు. హెన్రిచ్ క్లాసెన్ 14 మ్యాచ్‌ల్లో 606 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో మూడో స్థానంలో కొనసాగుతున్నాడని గుర్తుచేశారు. అలాగే ఇషాన్ కిషన్ 569 పరుగులతో ఆరో స్థానంలో ఉండగా, అభిషేక్ శర్మ 563 పరుగులతో ఏడో స్థానంలో ఉన్నాడన్నారు. ప్రత్యేకంగా అభిషేక్ శర్మ ఈ సీజన్‌లో అత్యంత దూకుడుగా ఆడుతున్నాడని అక్షర్ ప్రశంసించారు. అతడి స్ట్రైక్ రేట్ 200 దాటడం చిన్న విషయం కాదన్నారు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కలిసి జట్టుకు మెరుపు ఆరంభాలు అందిస్తున్నారని, దాంతో మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు ఒత్తిడి లేకుండా ఆడగలుగుతున్నారని చెప్పారు. బ్యాటింగ్ మాత్రమే కాకుండా ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం కూడా సమతూకంగా కనిపిస్తోందని అక్షర్ అభిప్రాయపడ్డారు. ప్రత్యర్థి జట్లు ఎంత పెద్ద స్కోరు చేసినా ఛేదించే సామర్థ్యం హైదరాబాద్ జట్టుకు ఉందన్నారు. అందుకే ప్లేఆఫ్స్‌లో తాను ఎస్ఆర్‌హెచ్‌ను బలమైన జట్టుగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా బుధవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. లీగ్ దశలో హైదరాబాద్ 18 పాయింట్లతో మూడో స్థానంలో నిలవగా, రాజస్థాన్ 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. మరోవైపు మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేతతో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.




## టీ20ల్లో 200 పరుగులే లక్ష్యం

**ముంబై, మే 25 :** ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తన భవిష్యత్ లక్ష్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 క్రికెట్‌లో వ్యక్తిగతంగా 200 పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ సీజన్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్న వైభవ్, ప్రస్తుతం టీ20ల్లో ఉన్న అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును బద్దలు కొట్టాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. 2013 ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడిన గేల్, పూణె జట్టుపై అజేయంగా 175 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. ఆ రికార్డును అధిగమించాలని ఉందా అని ప్రశ్నించగా వైభవ్ సూటిగా స్పందించాడు. తాను ఆ రికార్డును తప్పకుండా బ్రేక్ చేయాలనుకుంటున్నానని చెప్పాడు. ఒక మ్యాచ్‌లో పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేసే అవకాశం లభిస్తే 200 పరుగులు సాధించడం అసాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశాడు. యువ ఆటగాడి ఈ ధైర్యవంతమైన లక్ష్యం ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఐపీఎల్‌లో తన దూకుడైన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైభవ్, భవిష్యత్తులో భారత క్రికెట్‌కు కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.

# అదరగొట్టిన అర్జున్ టెండూల్కర్

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున అరంగేట్రం చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 )లో భాగంగా శనివారం పంజాబ్ కింగ్స్ తో జరిగిన పోరులో అతడు ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఆడాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నెగ్గి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. 2025 వరకు కూడా అర్జున్ టెండూల్కర్ ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఒకటి రెండు మ్యాచ్‌లు కూడా ఆడాడు. అయితే 2026 సీజన్‌కు ముందు ట్రేడ్ ద్వారా లక్నో సూపర్ జెయింట్స్‌కు మారాడు. రంజీల్లో కూడా ముంబై తరుఫున అవకాశాలు రావడం లేదనే ఉద్దేశంతో గోవాకు అర్జున్ టెండూల్కర్ మారాడు. ఇక లక్నోకు మారిన తర్వాత కూడా అర్జున్ టెండూల్కర్‌కు వెంటనే అవకాశాలు రాలేదు. తొలి 13 మ్యాచ్‌లకు అతడు డ్రింక్స్ మోస్తూ కనిపించాడు. అయితే 14వ మ్యాచ్‌లో లక్నో తరఫున ఆడే అవకాశం వచ్చింది. ఈ సీజన్‌లో లక్నో అట్టర్ ఫ్లాప్ ప్రదర్శన చేసింది. కేవలం 4 మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. 8 పాయింట్లతో సీజన్‌ను చివరి స్థానంతో ముగించింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన పోరులో అర్జున్ టెండూల్కర్‌కు అవకాశం రాగా.. తొలుత బ్యాటింగ్‌లో 5 బంతుల్లో 5 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇక బౌలింగ్‌లో మాత్రం ఆకట్టుకున్నాడు. 4 ఓవర్లు వేసిన అర్జున్ టెండూల్కర్ 36 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. అదే సమయంలో ఎన్నో మ్యాచ్‌ల అనుభవం ఉన్న ఇతర బౌలర్లు ధారాళంగా పరుగులు



సమర్పించుకున్నారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన పోరులో అర్జున్ టెండూల్కర్‌వే బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్. షమీ 2 వికెట్లు తీసినా 45 పరుగులు సమర్పించుకున్నాడు. ప్రిన్స్ యాదవ్ 3 ఓవర్లలో 32 పరుగులు.. మోసిన్ ఖాన్ 4 ఓవర్లలో 48 పరుగులు.. దిగ్వేష్ రాఠీ 3 ఓవర్లలో 39 పరుగులు ఇచ్చుకున్నారు. వీరు ఈ సీజన్‌లో చాలా మ్యాచ్‌లే ఆడారు. అయితే వీరి కంటే అర్జున్ టెండూల్కర్ బెటర్‌గా బౌలింగ్ చేయడం విశేషం. అర్జున్ టెండూల్కర్ లక్నో డెబ్యూ అనంతరం సచిన్ టెండూల్కర్ ఎక్స్ వేదికగా ట్వీట్ వేశాడు. క్రికెట్‌లో సహనం చాలా ముఖ్యమన్నారు. తండ్రిగా గర్విస్తున్నానంటూ పేర్కొన్నాడు. నీకు ఎంతో ఇష్టమైన క్రికెట్ కోసం కష్టపడంటూ సలహా ఇచ్చాడు. ఈ క్రమంలో తొలి 13 మ్యాచ్‌ల్లో అవకాశాలు రాకపోయినా.. ఏ మాత్రం నిరాశ పడకుండా చివరి వరకు స్ఫూర్తితో ఉన్నావనే అదే నీకు అవకాశాన్ని తెచ్చిందని సచిన్ పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# సీఎస్కే జట్టులోకి హార్దిక్ పాండ్యా?

ఐపీఎల్ 2026 సీజన్లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రదర్శన ఘోరంగా నిరాశపరిచింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టు ఈ సీజన్ లీగ్ దశలో నిలకడైన ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో కూడా ఓడిపోవడంతో ముంబై జట్టు ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 విజయాలతో పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పరిమితమైంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు కూడా ఈ సీజన్ ఓ పీడకలలా సాగింది. ఒకవైపు గాయాలు మరోవైపు పేలవమైన ఫామ్‌తో హార్దిక్ పాండ్యా తీవ్రంగా సతమతమయ్యాడు. ఈ సీజన్ ముగిసిన తర్వాత హార్దిక్‌ను ముంబై జట్టు ట్రేడింగ్ ద్వారా వేరే జట్టుకు పంపించబోతోందనే వార్తలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హార్దిక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ఫోటో నెటిజన్లలో తీవ్ర చర్చకు దారితీసింది. హార్దిక్ పాండ్యా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ ఇంట్రెస్టింగ్ ఫోటోను పంచుకున్నాడు. ఆ ఫోటోలో ఒక లాప్‌టాప్, ఒక నోట్‌బుక్, ఒక పెన్, హార్దిక్ మొబైల్ ఫోన్ ఉన్నాయి. అయితే ఈ ఫోటోలో క్రికెట్ అభిమానుల కళ్లు నేరుగా హార్దిక్ మొబైల్ స్క్రీన్‌పై పడ్డాయి. ఆ ఫోన్ డిస్‌ప్లేపై సమయం “07:07” అని చూపిస్తోంది. ఈ నంబర్‌ను చూడటమే ఆలస్యం.. సోషల్ మీడియా యూజర్లు దీనికి టీమిండియా లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనీతో లింక్ పెట్టడం ప్రారంభించారు. క్రికెట్ ప్రపంచంలో ‘7’ అనే నంబర్ ధోనీ జెర్సీ నంబర్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సోషల్ మీడియా 7 నంబర్ అనగానే ‘తలా ఫర్ ఏ రీజన్” ట్రెండ్ ఎంతలా వైరల్ అవుతుందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు హార్దిక్ ఫోన్‌లో సరిగ్గా 7 గంటల 7 నిమిషాలు ఉన్నప్పుడు స్క్రీన్‌షాట్ తీసి పోస్ట్ చేయడంతో.. ఇదంతా ధోనీ కోసమేనని నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. పైగా వచ్చే సీజన్‌లో హార్దిక్ పాండ్యా ముంబైని వీడి, ధోనీ మెంటార్‌గా ఉన్న సీఎస్కే(చెన్నై సూపర్ కింగ్స్) జట్టులోకి మారబోతున్నాడనే హింట్ ఇవ్వడానికే ఈ పోస్ట్ పెట్టాడంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ చర్చలపై హార్దిక్ కానీ, ముంబై యాజమాన్యం కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. మరోవైపు ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ ఈ సీజన్ వైఫల్యంపై స్పందిస్తూ.. హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై ఇప్పుడే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశాడు. “ప్రస్తుతం జట్టు ప్రదర్శనపై పోస్టుమార్టమ్ చేయడానికి ఇది సరైన సమయం కాదు. ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా అది భావోద్వేగాలతో కూడుకున్నది అవుతుంది.




ఎక్కడ తప్పు జరిగిందో ప్రశాంతంగా కూర్చుని ఆలోచించడానికి ప్రతి ఒక్కరికీ కొంత సమయం, స్పేస్ కావాలి. అప్పుడే మేనేజ్మెంట్ పరంగా సరైన నిర్ణయాలు తీసుకోగలం. అంతేకానీ ఇప్పుడే హడావిడిగా హార్దిక్ భవిష్యత్తు గురించి మాట్లాడటం బాధ్యతారాహిత్యం అవుతుంది” అని కీరన్ పొలార్డ్ పేర్కొన్నాడు.



# థియేటర్ వివాదంలో రంగంలోకి చిరంజీవి

**హైదరాబాద్, మే 25 :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అమలుపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రమవడంతో పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు త్వరలో చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీపై ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉండగా, సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్స్‌డ్ రెంటల్ విధానమే కొనసాగుతోంది. ఇదే అంశంపై ఎగ్జిబిటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ వేదికల ప్రభావం, విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల నిర్వహణ భారంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే రకమైన అద్దె చెల్లించాల్సి రావడం వల్ల తీవ్ర నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న రెవెన్యూ షేరింగ్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతుండటంతో ఈ వివాదం మరింత వేడెక్కింది. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా నుంచే పర్సంటేజ్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో టికెట్ ధరల పెంపుపై కూడా ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే థియేటర్లకు ప్రేక్షకుల సంఖ్య తగ్గుతోందని, అదనపు ధరలు విధిస్తే సాధారణ ప్రేక్షకులు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమలో సమస్యలు వచ్చినప్పుడు ముందుండి స్పందించే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో, ఈ వివాదానికి ఆయన మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.




# సర్జరీలపై అవికా గోర్ క్లారిటీ



సినీ పరిశ్రమలో అందం, ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉండటంతో హీరోయిన్లపై తరచూ ప్లాస్టిక్ సర్జరీల ప్రచారం జరుగుతూనే ఉంటుంది. తాజాగా యంగ్ హీరోయిన్ అవికా గోర్‌పై కూడా ఇలాంటి రూమర్లు రావడంతో ఆమె వాటిపై ఘాటుగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అవికా గోర్ తన లుక్ గురించి వస్తున్న గాసిప్స్‌పై స్పందించింది. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ తర్వాత తన అందాన్ని మెయింటైన్ చేయడానికి ప్రత్యేక కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు తీసుకున్నారనే వార్తలపై ప్రశ్నించగా.. "నేను ఒక ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట నిజమే. కానీ అది అందం కోసం కాదు. ముఖంపై వచ్చిన పింపుల్స్ తగ్గించుకోవడానికి మాత్రమే ట్రీట్‌మెంట్ తీసుకున్నాను. అది కూడా పెద్దగా పనిచేయలేదు" అని చెప్పింది. నటిగా కనిపించే తీరు కోసం అవసరాన్ని బట్టి పార్లర్‌కు వెళ్లేదానినని, కానీ ఎలాంటి పెద్ద సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది. "నేను ఏడేళ్ల వయసులోనే మేకప్ వేసుకోవడం ప్రారంభించాను. అందుకే చర్మాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ సన్‌స్క్రీన్ వాడేదానిని. మా అమ్మకు ఇలాంటి విషయాలంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. చిన్న టాటూ వేసుకున్నా, హెయిర్ కట్ చేసినా కూడా టెన్షన్ పడిపోయేది. అలాంటప్పుడు నేను పెద్ద కాస్మోటిక్ సర్జరీలు ఎలా చేయించుకుంటాను?" అంటూ ప్రశ్నించింది. తన శరీరంలో వచ్చిన మార్పులకు కారణం బరువు తగ్గడం, పెరగడమేనని అవికా తెలిపింది. "చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చి, వాళ్ల కళ్ల ముందే హీరోయిన్‌గా ఎదిగాను. నాకు చాలా త్వరగా బరువు పెరుగుతుంది, అలాగే తగ్గుతుంది కూడా. షూటింగ్ లేకపోతే తినడమే పని చేసేదానిని. వయసు పెరిగేకొద్దీ ప్రతి ఒక్కరిలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ నేను చిన్నప్పటి నుంచి అందరికీ తెలిసిన వ్యక్తిని కావడంతో, చిన్న మార్పు కనిపించినా సర్జరీలు చేశానని అనుకుంటున్నారు" అని చెప్పింది. అలాగే స్టార్ హీరోయిన్లు సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డేలను చూసి తాను కూడా ఫిట్‌గా మారాలని ప్రేరణ పొందానని అవికా తెలిపింది. ప్రస్తుతం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి బరువు తగ్గేందుకు కష్టపడుతున్నానని వెల్లడించింది.



# త్రిష 'లక్కీ ఛార్మ్'

సౌత్ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడం ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో "త్రిష లక్కీ ఛార్మ్" అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. ప్రముఖ హీరోల బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ "వారి విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది" అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. దీంతో ఈ అంశం మరింత హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి విజయ్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచింది. అలాగే అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో కూడా త్రిష కీలక పాత్ర పోషించింది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ అజిత్ కెరీర్‌లోనే పెద్ద హిట్‌గా నిలిచినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక చాలా కాలంగా సరైన విజయానికి ఎదురుచూస్తున్న సూర్య 'కరుప్పు' చిత్రంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా కూడా ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు భారీ విజయాల్లో త్రిష హీరోయిన్‌గా ఉండటంతో అభిమానులు ఆమెను "లక్కీ ఛార్మ్" అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట మల్లిడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె 'అవని' పాత్రలో కనిపించనుండగా, సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.


# రాశి సింగ్ గ్లామర్ షో..

## పచ్చటి చీరలో అదిరిపోయిన అందాలు



టాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యంగ్ హీరోయిన్ రాశి సింగ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా షేర్ చేసిన సాంప్రదాయ గ్లామరస్ ఫోటోలు అభిమానులను కట్టిపడేస్తున్నాయి. పచ్చటి రంగు చీరలో, హెవీ నగలతో, మినిమల్ మేకప్‌తో రాశి ఇచ్చిన ఫోజులు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. సంప్రదాయ కట్టులోనూ గ్లామర్‌ను మిళితం చేస్తూ ఆమె చేసిన ఫోటోషూట్‌కు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో జన్మించిన రాశి సింగ్ చిన్నతనం నుంచే నటిగా ఎదగాలని కలలు కనేది. ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడాలనే ఉద్దేశంతో 18 ఏళ్ల వయసులోనే ఎయిర్ హోస్టెస్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించింది. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వచ్చిన ఆమె, నటనపై ఉన్న ఆసక్తితో ఆ ఉద్యోగాన్ని వదిలేసి సినీ రంగంలో అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2021లో ఆది సాయికుమార్ హీరోగా వచ్చిన 'శశి' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమానే అయినప్పటికీ భాష తెలియకపోయినా కష్టపడి డైలాగులు నేర్చుకుని తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత 'పోస్టర్', 'జెమ్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించిన రాశి సింగ్, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. 'భూతద్దం భాస్కర్ నారాయణ' చిత్రంలో జర్నలిస్ట్ లక్ష్మి పాత్రలో, 'ప్రసన్నవదనం' సినిమాలో ఏసీపీ వైదేహి పాత్రలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. అలాగే 'బ్లైండ్ స్పాట్', 'పంచ్ మినార్' వంటి విభిన్న జానర్ చిత్రాల్లోనూ తన ప్రతిభను చాటుకుంది. వెండితెరతో పాటు డిజిటల్ వేదికలపైనా రాశి సింగ్ తన సత్తా చాటుతోంది. 'పాపం పసివాడు', 'త్రీ రోజెస్-2' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమాల్లో ఎక్కువగా సీరియస్, డీగ్లామరైజ్డ్ పాత్రల్లో కనిపించినప్పటికీ, నిజ జీవితంలో మాత్రం ఎంతో స్టైలిష్‌గా ఉంటుందని అభిమానులు చెబుతున్నారు. "నా సినిమాల్లో ప్రేక్షకులకు నా పాత్ర మాత్రమే కనిపించాలి" అనే భావనతో ముందుకు సాగుతున్న రాశి, సోషల్ మీడియాలో మాత్రం తన గ్లామర్ ఫోటోలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తాజాగా పచ్చటి చీరలో ఆమె చేసిన ఫోటోషూట్‌కు "అచ్చమైన తెలుగు అందం", "స్టన్నింగ్ లుక్", "సాంప్రదాయంలో గ్లామర్ క్వీన్" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం రాశి సింగ్ మరికొన్ని క్రేజీ టాలీవుడ్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

# సమంత సినిమాకు విజయ్ షాక్?






టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. మొదట ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేయాలని భావించినప్పటికీ, ఐపీఎల్ ప్రభావం కారణంగా విడుదల వాయిదా పడింది. అనంతరం జూన్ 19న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది', జూన్ 26న రానున్న 'లెనిన్' మధ్య గ్యాప్‌ను ఉపయోగించుకుని సోలో రిలీజ్ ప్రయోజనం పొందాలని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఈ ప్రణాళికకు ఊహించని అడ్డంకి ఎదురైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకుడు' కూడా అదే తేదీన విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం విజయ్ రాజకీయాల్లోకి పూర్తిగా అడుగుపెట్టే ముందు నటించిన చివరి సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వేదికల్లో జూన్ 19 విడుదల తేదీ కనిపించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. విజయ్‌కు తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ అభిమాన వర్గం ఉండటంతో 'జన నాయకుడు'కి పెద్ద ఎత్తున ఓపెనింగ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎక్కువగా విజయ్ సినిమాకే ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఇది 'మా ఇంటి బంగారం' థియేటర్ కేటాయింపులు, కలెక్షన్లపై ప్రభావం చూపవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి కంటెంట్ ఉన్నప్పటికీ స్క్రీన్ కౌంట్ తగ్గితే ఓపెనింగ్స్‌పై ప్రభావం పడటం సహజమేనని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి సమంత నిర్ణయంపైనే నిలిచింది. విజయ్ లాంటి భారీ స్టార్ సినిమాతో పోటీకి సిద్ధమవుతుందా? లేక వ్యాపారపరమైన లెక్కలు చూసుకుని మరోసారి విడుదల తేదీని మార్చుకుంటుందా? అనే అంశం ఆసక్తికరంగా మారింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# వైసీపీ భూదందాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ!

- విజయనగరంలో 700 కోట్ల భూకబ్జాపై సంచలన ఆరోపణలు
- స్కూల్ పేరుతో భూముల ఆక్రమణ.. డి-పట్టాలపై కన్నేసిన కబ్జాదారులు
- ప్రశ్నిస్తే కర్రలు, సైకిల్ చైన్లతో దాడులంటూ బాధితుల ఆవేదన
- టీడీపీ గ్రీవెన్స్‌కు భారీగా చేరుతున్న ప్రజలు.. చర్యలకు మంత్రుల హామీ



**విజయవాడ, మే 25:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూదందాలు, అక్రమాలపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి రోజురోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోంది. వారసత్వ భూములు, డి–పట్టా భూములు, ప్రభుత్వ స్థలాలు, లీజు భూముల ఆక్రమణలపై రాష్ట్రం నలుమూలల నుంచి బాధితులు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని తమ గోడును వెల్లగక్కుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో పలు జిల్లాలకు చెందిన బాధితులు సంచలన ఆరోపణలు చేస్తూ నేతలకు అర్జీలు సమర్పించారు. విజయనగరానికి చెందిన లియోనీ అనే మహిళ తన కుటుంబానికి చెందిన 50 ఎకరాల భూమిని వైఎస్సార్‌సీపీ నేతల అండతో రియల్టర్ అప్పలరాజు అక్రమంగా కబ్జా చేశాడని ఆరోపించారు. ఫోర్జరీ పత్రాలతో భూమిని స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ భూములు, పంట కాలువలు, చెరువులను కలిపి మొత్తం 80 ఎకరాల్లో "ఏఆర్ గ్రాండ్" పేరుతో అక్రమ లేఅవుట్ వేసినట్లు తెలిపారు. దీనివల్ల సుమారు రూ.700 కోట్ల విలువైన ఆస్తి దోపిడీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన కుళ్లాయమ్మ తమ తాతల కాలం నాటి భూమిని అక్రమంగా ఇతరుల పేర్లకు మార్చేందుకు రెవెన్యూ అధికారులు సహకరించారని ఆరోపించారు. ఏడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే జిల్లాకు చెందిన రత్నమ్మ అనే మహిళ 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న డి–పట్టా భూమిపై అక్రమార్కులు దొంగ పట్టాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, అడ్డుకున్నందుకు కర్రలు, సైకిల్ చైన్లతో దాడి చేశారని ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన మహాలక్ష్మి నాయుడు తన భూమిని స్కూల్ పేరుతో ఆక్రమించుకుని అద్దె చెల్లించకుండా అక్రమంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు. గుంటూరుకు చెందిన ఉమాసాయి ప్రియ తన బంగారు ఆభరణాలు మోసం చేసి తీసుకెళ్లిన వ్యక్తిపై కేసు నమోదైనా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. విజయవాడకు చెందిన కుమారి అనే మహిళ తన తండ్రి ఆస్తిని అన్నయ్య, వదిన అక్రమంగా తమ పేర్లకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, రెండేళ్లుగా డెత్ సర్టిఫికెట్ కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలుకు చెందిన నరేంద్రబాబు బీడీ కార్మికులకు కేటాయించిన ఇళ్ల స్థల పట్టా బదిలీ విషయంలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పింఛన్లు, రేషన్, ఇళ్ల నిర్మాణాలు, ఉద్యోగాలు, వైద్య సహాయం వంటి సమస్యలపై కూడా పలువురు గ్రీవెన్స్‌లో అర్జీలు సమర్పించారు. బాధితుల నుంచి మొత్తం 48 అర్జీలు స్వీకరించిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తెంటు లక్ష్మీనాయుడు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎస్.. నేనంటే నేనే..!

## (నో టైర్.. నో రిటైర్..)



**విజయనగరం, మే 25:** రాజకీయాల్లో కొందరు నేతలు కాలంతో పాటు నెమ్మదిస్తారు.. మరికొందరు పరిస్థితులకు తగ్గట్టు పక్కకు తప్పుకుంటారు. కానీ బొత్స సత్యనారాయణ మాత్రం "ఇంకా నేనున్నా" అనే సంకేతం ఇస్తూ మళ్లీ ఫుల్ యాక్టివ్ మోడ్‌లోకి వచ్చారు. వయసు, ఆరోగ్య సమస్యలు, మండుతున్న ఎండలు, భరించలేని ఉక్కపోత.. ఇవేవీ తన రాజకీయ ఉత్సాహాన్ని తగ్గించలేదని ఆయన తాజా పర్యటనలతో స్పష్టం చేస్తున్నారు. చీపురుపల్లిలో తన రాజకీయ పట్టు ఏ మాత్రం సడలకుండా ఉండాలన్న పట్టుదలతో బొత్స సత్తిబాబు మళ్లీ జనాల్లోకి దూసుకెళ్తున్నారు. కూతురు రాజకీయ భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. "ఇప్పుడే సైలెంట్ అయితే.. కేడర్ సడలిపోతుంది" అన్న భావనతోనే ఆయన మళ్లీ ఫీల్డ్‌లోకి వచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది వేసవిలో చీపురుపల్లిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో బొత్స వేదికపైనే అస్వస్థతకు గురై కుప్పకూలిపోయిన ఘటన అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇటీవల శాసన మండలిలో మాట్లాడుతుండగా కూడా ఆయన అస్వస్థతకు గురికావడం పార్టీలో చర్చనీయాంశమైంది. అంతేకాదు.. ఇటీవల వైఎస్ రాజశేఖ–రరెడ్డి మరణాన్ని గుర్తు చేసుకుంటూ మీడియా సమావేశంలో బొత్స భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం కూడా అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో బొత్స ఆరోగ్య పరిస్థితిపై అనేక ఊహాగానాలు వినిపించాయి. శారీరకంగానే కాదు.. మానసికంగా కూడా ఆయన కొంత బలహీనపడ్డారన్న వ్యాఖ్యలు వచ్చాయి. కానీ ఆ ప్రచారాలన్నింటికీ చెక్ పెడుతూ "బొత్స ఈజ్ బ్యాక్" అన్నట్టుగా ఆయన తాజా రాజకీయ చురుకుదనం కనిపిస్తోంది. రాజాంలో జరిగిన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బొత్స పాల్గొన్న తీరు కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. మండుతున్న ఎండలో యువకులే అల్లాడిపోతుంటే.. చెమటతో చొక్కా తడిసిపోయినా ఆయన మాత్రం అదే ఉత్సాహంతో కార్యక్రమాన్ని నడిపించారు. వేదికపై మాట్లాడినప్పుడు కూడా తనదైన దూకుడు, రాజకీయ పంచ్ ఎక్కడా తగ్గలేదు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. "రోగం తన రాజకీయ వైభోగానికి అడ్డుకాదని.. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని" బొత్స తన తాజా పర్యటనలతో చెప్పకనే చెబుతున్నారని ఆయన అనుచరులు అంటున్నారు. ప్రత్యర్థులకు మాత్రమే కాదు.. స్వపక్షంలో తనపై సందేహాలు పెట్టుకున్న వారికీ కూడా బొత్స సత్తిబాబు ఈ టూర్‌లతో గట్టి సంకేతాలే పంపారన్న విశ్లేషణ వినిపిస్తోంది.

మొత్తానికి..
"సత్తిబాబులో సత్తా ఇంకా తగ్గలేదు..
ఆయన స్టైల్ ఇంకా మారలేదు..
రాజకీయాల్లో తన ఛాప్టర్ ముగియలేదని
బొత్స మరోసారి గట్టిగా చాటిచెప్పారు."

# విశాఖ ఉక్కును అమ్మి భూములు కొట్టేయాలనుకున్నారు

- మాజీ సీఎం జగన్‌పై అచ్చన్న సంచలన వ్యాఖ్యలు



**శ్రీకాకుళం, మే 25 :** విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలని గత వైసీపీ ప్రభుత్వం చూసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసి.. ఆ విలువైన భూములను ఆక్రమించుకోవాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కుట్ర పన్నారని పేర్కొన్నారు. అధికార దాహంతో ఉక్కు భూములను ఆక్రమించాలని వైఎస్ జగన్ చూశారని మండిపడ్డారు. తన స్వార్థం కోసం వైఎస్ జగన్ ఎవరినైనా బలి చేస్తారన్నారు. సోమవారం శ్రీకాకుళంలో మంత్రి కె. అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నడుం బిగించారని తెలిపారు. ఈ ఉక్కు పరిశ్రమ కోసం కేంద్రాన్ని ఒప్పించి రూ.15 వేల కోట్ల నిధులను సీఎం చంద్రబాబు మంజూరు చేయించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఓ బ్రాండ్ అని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు విజన్‌కు ఆకర్షితులైన పారిశ్రామిక దిగ్గజాలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని చెప్పారు. గత వైసీపీ పాలనలో కమిషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించడమే కాకుండా.. భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వైసీపీని శాశ్వతంగా పాతాళానికి పంపుతామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారు.. రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నీకెంత – నాకెంత అన్నట్లుగా పాలన సాగేదని వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి స్థానం లేదని కుండబద్దలు కొట్టారు. అధికారం కోసం సొంత బాబాయినే అడ్డంగా నరికేశారని వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అధికారంలోకి వస్తామని పగటి కలలు

## జగన్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే ధూళిపాళ్ల

**గుంటూరు, మే 25:** కులాల మధ్య చిచ్చుపెట్టడమే వైకాపా నేతల పని అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. వైకాపా హయాంలో బడుగువర్గాలపై దాడులు చేశారని అన్నారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక చర్యల వల్లే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారని విమర్శించారు. ప్రజల తీర్పు చూసిన తర్వాత కూడా వైకాపా నేతల్లో మార్పు రాలేదు. వివాదాలు సృష్టించి యువతను కేసుల్లో ఇరికిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారు. జడ్జిలు, వాళ్ల కుటుంబసభ్యులపైనా దుష్ప్రచారం చేశారు. మాట వినలేదని అనేక మందిని హత్య చేశారు. ప్రజలు అధికారం ఇవ్వలేదనే అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారు. ఎక్కిడికి వెళ్లినా డ్రామాలు ఆడటమే వైకాపా నేతల పని అని ధూళిపాళ్ల అన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చుపెట్టడమే జగన్ అండ్ కో పని అని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కో మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారని ఆరోపించారు. జడ్జిలు, వాళ్ల కుటుంబసభ్యులపైనా కూడా దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. జగన్ అండ్ కో మాట వినలేదని అనేకమందిని హత్య చేశారని ఆరోపించారు. ప్రజలు అధికారం ఇవ్వలేదనే అక్కసుతోనే ఈ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికి వెళ్లినా డ్రామాలు ఆడటమే వైసీపీ నేతలు పనిగా పెట్టుకున్నారని సెటైర్లు గుప్పించారు. మొక్కజొన్న రైతన్నలకు న్యాయం చేయాలని అడిగితే తప్పు లేదని.. కానీ రైతుల పేరుతో దీక్ష పెట్టి తనపై, సంగం డెయిరీపై వైసీపీ నేతలు విమర్శలు చేశారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దుయ్యబట్టారు. గత 15 ఏళ్లుగా డెయిరీ అవసరాల కోసం మొక్కజొన్న కొంటున్నామని ప్రస్తావించారు. ప్రభుత్వాలపై ఆధారపడి తాము వ్యాపారం చేయటం లేదని స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనాలంటే కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. మొక్కజొన్న త్వరగా కొనాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారని చెప్పుకొచ్చారు. జగన్ రాజకీయ లబ్ది కోసం అన్నదాతలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.

# అభివృద్ధిని తట్టుకోలేక జగన్ అక్కసు

## రాష్ట్రానికి హనీమూన్ నాయకుడు

## జగన్ తీరుపై మండిపడ్డ మండిపల్లి



**అమరావతి, మే 25 :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి హనీమూన్ నాయకుడని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభివర్ణించారు. పాత సారాని కొత్త సీసాలో నింపి మార్కెటింగ్ చేసినట్లు వైఎస్ జగన్ వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఓర్వలేక నిత్యం అక్కసు వెళ్లగక్కుతున్నాడంటూ జగన్‌పై ఆయన మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విజయలక్ష్మి మినరల్స్‌తో మైనింగ్ దోపిడీ ప్రారంభించి.. భారతీ సిమెంట్స్, సండూర్ పవర్ వరకూ విస్తరించారని వివరించారు. దోపిడీ, బెదిరింపులు, మోసం చేసి.. సంపాదించిన నగదును రాజకీయాల్లో పెట్టి ఎదిగారని చెప్పారు. బలపనూరు నుంచి ప్రారంభమైన వైఎస్ కుటుంబ ప్రస్థానం రూ. లక్షల కోట్ల అవినీతి సామ్రాజ్యంగా విస్తరించిందని రవాణా శాఖ మంత్రి పేర్కొన్నారు. చెల్లని రూపాయిగా మారిన వైఎస్ జగన్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. జగన్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చి మంచి సలహాలు ఇస్తే.. వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఊళ్ళో పెళ్లికి కుక్కల హడావుడి అనే రీతిలో మహానాడు ప్రారంభం రోజు వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిందని వ్యంగ్యంగా అన్నారు. వైఎస్ జగన్ నిర్వహించే ఈ కార్యక్రమం మహానాడుకు దిష్టిచుక్క లాంటిదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

## నోటీసులపై 27న వివరణ ఇస్తాం : విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, మే 25:** ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సనీస్థలు కలిసి చేసిన రియల్ ఎస్టేట్ సంస్థకు ఈడీ అధికారుల నుంచి ఓ నోటీసు వచ్చిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్క పక్క సైట్లు ఉండటంతో రాజ్ కసిరెడ్డికి సంబంధించిన ఇశాన్వీ సంస్థతో 2021లో రియల్ ఎస్టేట్ చేసేందుకు ప్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఆ సంస్థ ద్వారా రూ.35 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సోమవారం విజయవాడలో కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. రాజ్ కసిరెడ్డి సంగతి తెలిశాక 2022లోనే.. ఆ కంపెనీ నుంచి బయటకు వచ్చేశామని కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆ లావాదేవీకి సంబంధించే ఈడీ అధికారులు సమాధానం కోరుతూ నోటీసు పంపించారని వెల్లడించారు. ఆర్కిటెక్ ఫీజు కోసం చేసిన రూ.35లక్షల ట్రాన్సాక్షన్ తప్ప ఇంకేమి జరగలేదని ఈడీ అధికారులకు చెబుతామని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో తన భార్యకు నోటీసులు వచ్చినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అప్పుడు పెట్టిన కంపెనీలో తన భార్య ఒక డైరెక్టర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆ కంపెనీకి నోటీసు వచ్చిందే తప్ప.. తన భార్యకు ఎలాంటి నోటీసు రాలేదని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# 123 మున్సిపాలిటీల్లో 1400 కోట్లతో డ్రైనేజీలు

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు, మే 25:** ఏపీలోని 123 మున్సిపాల్టీల్లో రూ.14వందల కోట్లతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో పలు మున్సిపల్ స్కూళ్లను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైబ్రిడ్ ద్వారా మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో మహానాడు మాదిరిగానే తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని చెప్పారు. కచ్చితంగా కార్యకర్తలకు మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు. నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తచరిత్ర ఎవరిదో ఏపీ ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. జగన్ అండ్ కో అసత్యాలు మాట్లాడేస్తే జనం నమ్మరని అన్నారు. రక్తచరిత్ర తెలుసు కాబట్టే గత ఎన్నికల్లో వైసీపీని 11సీట్లకు ప్రజలు పరిమితం చేశారని.. ఈ సారి జీరో తప్పదని హెచ్చరించారు. తమ ప్రభుత్వంపై కావాలని జగన్ అండ్ కో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎందుకు వినియోగించలేదని ప్రశ్నించారు. చివరకు స్వచ్ఛభారత్ నిధులను కూడా వినియోగించలేదని ఆగ్రహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, నిజాయతీగా పోస్టులు కేటాయించారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై జగన్ అండ్ కో విమర్శలు



## మళ్లీ పెరిగిన బంగారం

**హైదరాబాద్, మే 25:** బంగారం ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ఇప్పటికే రికార్డు స్థాయిలో కొనసాగుతున్న పసిడి ధరలు సోమవారం మరోసారి పెరిగాయి. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు బంగారం కొనుగోలు మరింత కష్టంగా మారింది. గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 320, 22 క్యారెట్ల బంగారంపై రూ. 300, 18 క్యారెట్ల బంగారంపై రూ. 250 పెరుగుదల నమోదైంది. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,59,380కు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం రూ. 1,46,100 వద్ద ట్రేడ్ అవుతుండగా, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 1,19,540 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిస్థితులు, డాలర్ మారకం విలువ, పెట్టుబడిదారుల ఆసక్తి పెరగడం వంటి కారణాలతో బంగారం ధరలు నిరంతరం పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరలు దాదాపు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో బంగారం ధర రూ. 1,59,380గా ఉంది. ఢిల్లీలో రూ. 1,59,430కు చేరుకోగా, చెన్నై, మధురై, కోయంబత్తూరులో అత్యధికంగా రూ. 1,61,240గా నమోదైంది. సూరత్‌లో కూడా ధర రూ. 1,59,430 వద్ద కొనసాగుతోంది. వివాహాలు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో బంగారం ధరలు పెరగడం కొనుగోలుదారులను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు ధరలు ఇంకా పెరిగే అవకాశముందని బులియన్ మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఈకోకు డిమాండ్

**హైదరాబాద్, మే 25 :** దేశీయ ఆటోమొబైల్ మార్కెట్లో అందుబాటు ధరలో లభించే 7 సీటర్ కార్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మారుతి సుజుకి ఈకో మరోసారి వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. తక్కువ ధర, మంచి మైలేజ్, తక్కువ నిర్వహణ ఖర్చు, పెద్ద కుటుంబాలకు అనువైన డిజైన్ కారణంగా ఈ వాహనం మధ్యతరగతి కుటుంబాలకు ప్రధాన ఎంపికగా మారుతోంది. మారుతి ఈకో ప్రస్తుతం దేశంలో అత్యంత చౌకైన 7 సీటర్ సీఎన్‌జీ కార్లలో ఒకటిగా నిలుస్తోంది. ఈ వాహనం 1.2 లీటర్ కె సిరీస్ పెట్రోల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. పెట్రోల్, సీఎన్‌జీ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉన్న ఈకో, సీఎన్‌జీ మోడల్‌లో కిలోకు సుమారు 26.78 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని సంస్థ వెల్లడించింది. వాహన నిపుణుల అభిప్రాయం ప్రకారం తక్కువ నిర్వహణ ఖర్చులే ఈ కారుకు అతిపెద్ద బలం. దేశంలోని ఇతర 7 సీటర్ కార్ల ధరలు సాధారణంగా రూ. 8 లక్షలకు పైగా ఉండగా, ఈకో మాత్రం తక్కువ ధరకే లభించడం వినియోగదారులను ఆకర్షిస్తోంది. మారుతి సుజుకి విస్తృతమైన సర్వీస్ నెట్‌వర్క్, తక్కువ ధరలో విడిభాగాలు లభించడం కూడా ఈ కారుకు మరో ప్రధాన ప్లస్ పాయింట్‌గా చెప్పవచ్చు. ప్రస్తుతం మారుతి ఈకో ప్రారంభ ధర సుమారు రూ. 5.21 లక్షలు కాగా, సీఎన్‌జీ వేరియంట్ ధర రూ. 6.36 లక్షలుగా ఉంది. అయితే ప్రీమియం ఫీచర్లు లేకపోవడం ఈ కారుపై వినిపిస్తున్న ప్రధాన విమర్శ. టచ్‌స్క్రీన్, పవర్ విండోస్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్ వంటి ఆధునిక సదుపాయాలు ఇందులో లేవు. అయినప్పటికీ తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు అందించే కుటుంబ కారుగా ఈకో మార్కెట్లో మంచి స్థానం సంపాదించుకుంటోందని ఆటో రంగ విశ్లేషకులు చెబుతున్నారు.

## పీఎఫ్ ఖాతా లాక్ అయితే ఇలా




**హైదరాబాద్, మే 25 :** దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాలను వినియోగిస్తున్నారు. అయితే ఇటీవల సాంకేతిక కారణాలు, భద్రతా నిబంధనల కఠినతరం కారణంగా చాలామంది పీఎఫ్ ఖాతాలు తాత్కాలికంగా లాక్ అవుతున్నాయి. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే పీఎఫ్ ఖాతా శాశ్వతంగా మూసివేయబడదని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇంటి నుంచే తిరిగి యాక్టివేట్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పీఎఫ్ ఖాతాలోకి లాగిన్ కావడానికి ప్రయత్నించినప్పుడు అకౌంట్ బ్లాక్ లేదా లాక్ అయినట్లు సందేశం కనిపించవచ్చు. పాస్‌వర్డ్‌ను పలుమార్లు తప్పుగా నమోదు చేయడం, గడువు ముగిసిన ఓటీపీని మళ్లీ మళ్లీ ఉపయోగించడం, అనుమానాస్పద లాగిన్ ప్రయత్నాలు చేయడం వంటి కారణాలతో భద్రతా వ్యవస్థ అకౌంట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తుంది. ఇటీవల ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధార్ ధృవీకరణ, భద్రతా నిబంధనలను మరింత కఠినతరం చేసింది. పేరులో అక్షర దోషాలు ఉండటం, మధ్య పేరు లేకపోవడం, ఇంటి పేరు వేరే విధంగా నమోదు కావడం, ఆధార్ ధృవీకరణ విఫలం కావడం, బ్యాంక్ ఖాతా వివరాలు యజమాని ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండటం వంటి కారణాల వల్ల కూడా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ముందుగా కొంత సమయం వేచి ఉండాలి. కూలింగ్ ఆఫ్ సమయం పూర్తయిన తర్వాత కొన్ని ఖాతాలు స్వయంగా మళ్లీ యాక్టివ్ అవుతాయి. అవసరమైతే పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసుకోవాలి. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ యాక్టివ్‌గా ఉండటం కూడా చాలా ముఖ్యం. ఉద్యోగ సంస్థ ఆమోదం కోసం అభ్యర్థనలు పెండింగ్‌లో ఉంటే సంబంధిత హెచ్‌ఆర్ విభాగాన్ని సంప్రదించి ఆమోదం పొందాలి. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఫిర్యాదుల పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరమైతే సమీపంలోని పీఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించి సమస్య పరిష్కరించుకోవచ్చు.

# రూపాయి విలువపై ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, మే 25 :** డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడుతున్న పరిస్థితులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రూపాయి విలువ ఓవర్ వాల్యూ అయిందని చెప్పలేమని, అయితే వాస్తవిక విలువ కంటే తక్కువ స్థాయిలో ట్రేడవుతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితులు వంటి కారణాలతో ఇటీవలి కాలంలో రూపాయి విలువ భారీగా పడిపోయిందని తెలిపారు. రూపాయికి ఒక నిర్దిష్ట మారకపు విలువను నిర్ణయించడం కంటే విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికే ఆర్బీఐ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట మారకపు రేటును లక్ష్యంగా పెట్టుకోలేదని పేర్కొన్నారు. కరెన్సీ మార్కెట్‌లో అసాధారణ అస్థిరతలు లేదా అధిక ఊహాగానాలు చోటుచేసుకున్నప్పుడు మాత్రమే కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకుంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం రూపాయి రెండు వారాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.20 వద్ద కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ శాంతి చర్చలపై ఆశలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పట్టడం రూపాయికి కొంత ఊరటనిచ్చినట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఫిబ్రవరి చివర్లో ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి రూపాయి విలువ దాదాపు 6 శాతం మేర బలహీనపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పడుతున్న నేపథ్యంలో ఆర్బీఐ చర్యలు ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, మే 25:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుంచే సానుకూల ధోరణి కనబరిచిన సూచీలు చివరికి భారీ ఎగబాకుతో ముగియడంతో మదుపర్ల సంపద గణనీయంగా పెరిగింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,074 పాయింట్లు ఎగిసి 76,489 వద్ద స్థిరపడగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 312 పాయింట్లు లాభపడి 24,032 వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిణామాలు భారత మార్కెట్లకు అనుకూలంగా మారడం ఈ ర్యాలీకి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయనే వార్తలు ప్రపంచ మార్కెట్లలో ఆశావాహ వాతావరణాన్ని తీసుకువచ్చాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం కూడా భారత మార్కెట్లకు ఊరటనిచ్చింది. బ్యాంకింగ్, ఐటీ, ఆటో, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు మరింత బలపడ్డాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కూడా కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో మార్కెట్‌లో ఉత్సాహం కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి విస్తృతంగా అన్ని రంగాల్లో లాభాలు నమోదయ్యాయి. ఈ భారీ ర్యాలీతో మదుపర్ల ముఖాల్లో ఆనందం కనిపించింది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే రానున్న రోజుల్లో కూడా మార్కెట్ స్థిరంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రపంచ రాజకీయ పరిణామాలు, చమురు ధరల మార్పులు మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ఇంధన ధరలపై నిర్మలా సీతారామన్ స్పందన



**న్యూఢిల్లీ, మే 25 :** దేశంలో పెరుగుతున్న ఇంధన ధరలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్ఠంగానే ఉందని ఆమె స్పష్టం చేశారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 37వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు సమాధానం ఇచ్చారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించాలని డిమాండ్లు వస్తున్నాయని, కానీ అలాంటి నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి దాదాపు లక్ష కోట్ల రూపాయల ఆదాయం నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం ప్రత్యేకంగా '3-ఎఫ్' అంశాలపై దృష్టి పెట్టిందని మంత్రి వెల్లడించారు. ఇంధనం, ఎరువులు, విదేశీ మారక నిల్వలు అనే మూడు కీలక రంగాలపై కేంద్రం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోందని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఎరువుల ధరలు భారీగా పెరిగాయని, బంగారం ధరల పెరుగుదల కూడా సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకుంటోందని, బయటి ఒత్తిళ్లను ఎదుర్కొనేలా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు ఎక్కువగా అంతర్జాతీయ పరిణామాల కారణంగానే ఉత్పన్నమవుతున్నాయని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని స్పష్టం చేశారు. దేశ ప్రజల్లో నమ్మకం, ధైర్యం పెంచాల్సిన సమయంలో కొందరు కేవలం ప్రతికూల ప్రచారానికే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని మంత్రి హితవు పలికారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను గుర్తించాలని, దేశ ఆర్థిక వ్యవస్థపై అనవసర భయాలు సృష్టించడం మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# ఐక్యూబ్‌కు పెరుగుతున్న ఆదరణ





**హైదరాబాద్, మే 25 :** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వంసగా పెరుగుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో రోజువారీ ప్రయాణాలకు అనువుగా ఉండే ఎలక్ట్రిక్ స్కూటర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ క్రమంలో టీవీఎస్ సంస్థ తయారు చేసిన 'ఐక్యూబ్' ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతోంది. ఆకర్షణీయమైన డిజైన్, అధునాతన సాంకేతిక ఫీచర్లు, మంచి రేంజ్ కారణంగా వినియోగదారులను ఆకట్టుకుంటోంది. టీవీఎస్ సంస్థ ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్, ఐక్యూబ్ ఎస్‌టీ పేర్లతో మూడు రకాల మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో బేసిక్ మోడల్ తక్కువ ధరలో లభిస్తుండగా, ఎస్‌టీ మోడల్ అత్యాధునిక ఫీచర్లతో ప్రీమియం వాహనంగా నిలుస్తోంది. ఐక్యూబ్ స్కూటర్లలో 2.2 కిలోవాట్, 3.1 కిలోవాట్, 3.5 కిలోవాట్, 5.3 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలు ఉన్నాయి. 2.2 కిలోవాట్ బ్యాటరీ కలిగిన స్కూటర్ ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే సుమారు 94 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 3.1 కిలోవాట్ మోడల్ 123 కిలోమీటర్ల వరకు, 3.5 కిలోవాట్ మోడల్ 145 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. టాప్ మోడల్ అయిన ఐక్యూబ్ ఎస్‌టీ 5.3 కిలోవాట్ బ్యాటరీతో ఏకంగా 212 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని సంస్థ వెల్లడించింది. ఈ స్కూటర్లలో ఎల్‌ఈడీ లైటింగ్, ఎకో మోడ్, పవర్ మోడ్, రివర్స్ పార్కింగ్ సదుపాయం, బ్లూటూత్ కనెక్టివిటీ, మొబైల్ కాల్, సందేశాల అలర్ట్స్, నావిగేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఐక్యూబ్ ఎస్‌టీ మోడల్‌లో ప్రత్యేకంగా పెద్ద టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, వాయిస్ అసిస్టెంట్, టైర్ గాలి ఒత్తిడి సూచన వ్యవస్థ వంటి ఆధునిక సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ స్కూటర్ల ధరలు మోడల్‌ను బట్టి మారుతున్నాయి. ఎక్స్ షోరూమ్ ధర సుమారు రూ. 1.13 లక్షల నుంచి రూ. 1.72 లక్షల వరకు ఉండగా, ఆన్ రోడ్ ధర రూ. 1.24 లక్షల నుంచి రూ. 1.78 లక్షల వరకు ఉంది. ప్రభుత్వ సబ్సిడీ వర్తిస్తే ధర కొంత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.